నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 29 జులై 2024 | www.navatelangana.com

జూలై 30న రైతు రుణమాఫీ రెండవ విడత విడుదల

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ రెండవ విడత నిధులను ప్రభుత్వం జూలై 30న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి అసెంబ్లీ ప్రాంగణంలో రెండో విడత రుణమాఫీ విడుదల చేస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జూలై 30న ఉదయం 11 గంటలకు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధుల, రైతుల, అధికారుల సమక్షంలో రెండో విడత రుణమాఫీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు అధికారులు వ్యవసాయ శాఖ సిబ్బంది సహకార శాఖ సిబ్బంది బ్యాంక్ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుణమాఫీ లబ్దిదారులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈఓ సస్పెండ్

నవతెలంగాణ-కొమురవెల్లి : కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఈఓ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈఓపై ఇటీవల పలురకాల ఆరోపణలు రావడంతో అతనిపై చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేయడంతో ఆయనపై ఎట్టకేలకు దేవాదాయ శాఖ చర్యలకు సిద్ధమైంది. ఆలయ కాంట్రాక్టర్లను బెదిరిస్తూ కమిషన్లు వసూలు చేస్తున్నాడని, ఇటీవల సెలవు పెట్టకుండా ఇతర రాష్ట్రాలకు విహారయాత్రలకు వెళ్లి వచ్చిన అనంతరం హాజరు పుస్తకంలో విధులు నిర్వహించినట్టు సంతకాలు చేశాడని ఆరోపణలు వచ్చాయి. ఆలయ ఈవో బాలాజీ ముందే తోటి ఉద్యోగి పై భౌతిక దాడికి పాల్పడ్డ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మల్లన్న జాతర సమయంలో వీవీఐపీ పాసులను అమ్ముకొని పట్టుబడ్డాడని, అతనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు చేశారు. ఈ నెల 16న జరిగిన హుండీ లెక్కింపులో బంగారు గొలుసు మాయమై చెత్త బుట్టలో దొరికిన సంఘటనలో ఏఈఓ గంగ శ్రీనివాస్ పాత్ర ఉందంటూ ఆరోపణలు రావడంతో అతనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈఓ బాలాజీ ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఆదేశాలతో ఆదివారం ఆలయ ఈవో బాలాజీ ఏఈఓ గంగ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఓఎఫ్‌సీఇయు ఘనవిజయం



నవతెలంగాణ-కంది

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో శనివారం జరిగిన జూనియర్ స్టాఫ్ క్లబ్ ఎన్నికలలో కూటమిపై ఓ ఎఫ్ సీ ఇ యు ఘనవిజయం సాధించింది. బిపిఎంఎస్, ఐఎన్‌టియుసి, ఓఎఫ్ఆర్‌యుల కూటమికి 5 సీట్లు రాగా ఒంటరిగా పోటీ చేసిన ఓఎఫ్ సీ ఇ యు 6 సీట్లు గెలుపొందారు. ఈ సందర్భంగా ఓ ఎఫ్ సీ ఇ యు జనరల్ సెక్రటరీ నర్సింలు మాట్లాడుతూ ఎర్రజెండాపై నమ్మకముంచి 6 సీట్లు గెలిపించిన ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలియచేస్తూ జూనియర్ క్లబ్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఫ్యాక్టరీకి పూర్తి స్థాయిలో వర్క్ లోడ్, కార్పొరేటీకరణ ఆపాలని , ఎన్ పి ఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలని భవిష్యత్తు లో జరిగే పోరాటాలకు కార్మికులు పూర్తి స్థాయిలో మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్ మల్లేశం,జే సి ఎం 3 ఎం లక్ష్మయ్య, జే సి ఎం,4 ఎం.మల్లేశం, అనందకుమార్, పి వెంకటేశ్వర్లు,టీ.రమేష్‌లు పాల్గొన్నారు.

బీఎంఎస్ నుంచి సీఐటీయూలో చేరిక

సీఐటీయూ ద్వారానే కార్మికుల సమస్యల పరిష్కారం
సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

సీఐటీయూ ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేష్ అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో అర్చ్ ఫార్మా పరిశ్రమకు చెందిన బి ఎంఎస్ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి మల్లేష్ మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అని అన్నారు. సీఐటీయూ లో చేరినందుకు అభినందనలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. లేకపోతే భవిష్యత్తులో పోరాటాలు చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కే.రాజయ్య, యూనియన్ కార్యదర్శి శ్రీరాములు, భరత్ భూషణ్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడియారం మాశ్రిత అదృశ్యం



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన పోతుల మాశ్రీత (23) ఈ నెల 23వ తేది మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. తన సర్టిఫికెట్స్ తీసుకొని వస్తానని చిన్నమ్మ అయిన రుద్రారం భావనకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. మాశ్రీత తిరిగి ఇంటికి రానందున ఆమె గురించి చుట్టుపక్కల వారి బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. మాశ్రీత ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వస్తుందని ఆమె తండ్రి చేగుంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చేగుంట ఎస్సై బాల్ రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

బురదమయమైన రోడ్డులో నాట్లు వేసి గ్రామస్థుల నిరసన

ఈ రోడ్డు బాగు చేయించండి సారు.....!



నవతెలంగాణ-మిరుదొడ్డి

వర్షాకాలం వచ్చిందంటే పొలాల్లో వరి నాట్లు వేయడం కామన్. కానీ వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామ యువకులు రోడ్లపై నాట్లు వేశారు. అదేంటి యువకులు రోడ్లపై నాట్లు వేయడం అనుకుంటున్నారా.. నిజమే మీరు విన్నది, చూస్తున్నది నిజమే. మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామం నుంచి మిరుదొడ్డి, హబ్సిపూర్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు ఏళ్ల తరబడి గుంతల మయంగా మారి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ వర్షాకాలం ఏకంగా బీటీ రోడ్డు కాస్త మట్టి రోడ్డును తలపించేలా తయారైంది. బురదమయంగా మారిన రోడ్డుపై ప్రయాణం చేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుని గ్రామస్తులు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు వ్యవసాయ పొలంలోనే నాట్లు వేసేవారు. కానీ ప్రభుత్వానికి నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను యువకులు రోడ్డుపైన నాట్లు వేస్తూ దర్శనమిస్తున్నారు. ఉన్నత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏకంగా ఆ గ్రామ యువకులు బురదమయంగా మారిన రోడ్లపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రాణాలు పోతున్నా రోడ్డు పనులు చేయించరా అంటూ గ్రామస్తులు ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని డిమాండ్ చేశారు.

జాతరలో పులిహోర వడ్డించిన ఎస్ఐ

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ పట్టణంలో ఆదివారం జరిగిన శ్రీ శ్రీ శ్రీ ఉజ్జయిని మహంకాళి జాతరకు విచ్చేసిన భక్తులకు ప్రజాసేవలో భాగంగా తూప్రాన్ ఎస్ఐ శివానంద్ పులిహోర వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివానంద్ మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులకు ప్రసాదంగా పులిహోరను ఇవ్వడం జరుగుతుందన్నారు.

మహిళలకు.. బీమాతో ధీమా



- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బీమా పథకాలు
- స్త్రీ నిధి, రుణ, ప్రమాద బీమా సదుపాయం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 49536 సంఘాల్లో...
- 5.09 లక్షల మహిళా సభ్యులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల కోసం గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ బీమా పథకాలతో ధీమా కల్పిస్తుంది. ఇప్పటికే స్త్రీ నిధి సురక్ష బీమా పథకం అమల్లో ఉండగా కొత్తగా రుణ, ప్రమాద బీమా పథకాలను కూడా అమల్లోకి తెచ్చింది. స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా చేరిన మహిళలు అనుకోని పరిస్థితిలో మృతి చెందితే ఆ కుటుంబానికి బీమా పథకాల ద్వారా ధీమా కల్పించే లక్ష్యంతో అమల్లోకి వచ్చిన పథకాలు ఎంతో మేలే చేకూర్చనున్నాయి. ప్రమాద బీమా వర్తించడంతో పాటు ఎస్‌హెచ్‌జీ సభ్యురాలుగా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా తీసుకునే రుణాల్ని సైతం తిరిగి చెల్లించాల్సిన అవసరముండదు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో స్వయం సహాయ సంఘాలు యాక్టీవ్‌గా పనిచేస్తున్నాయి. 10 నుంచి 15 మంది వరకు ఒక గ్రూపుగా ఏర్పడి ప్రతి నెలా పొదుపు చేస్తారు. అలా పొదుపు చేసిన డబ్బుల్ని తిరిగి తమ అవసరాల కోసం తీసుకుని మళ్లీ పొదుపుతో పాటు తీసుకున్న డబ్బుల్ని వాయిదా పద్ధతిలో చెల్లిస్తారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా కూడా రుణాలు పొంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. అలా వ్యాపారం చేస్తూ వారి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 49536 స్వయం సహాయ సంఘాలున్నాయి. వీటిల్లో 5.09 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో 18795 సంఘాలుండగా వీటిల్లో 1.90 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. మెదక్ జిల్లాలో 12400 సంఘాల్లో 1.30 లక్షల మంది, సిద్దిపేట జిల్లాలో 18341 సంఘాల్లో 1.89 లక్షల మంది సభ్యులున్నారు.

జిల్లా	సంఘాలు	సభ్యులు లక్షల్లో
సిద్దిపేట	18341	1.89
మెదక్	12400	1.30
సంగారెడ్డి	18795	1.90
మొత్తం	49536	5.09 లక్షలు

వీరంతా స్థానిక బ్యాంకుల్లో బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకుంటారు. ప్రతి నెల పొదుపు డబ్బులతో పాటు రుణ వాయిదాల్ని క్రమం తప్పకుండా చెల్లిస్తారు. తరచూ సమావేశాలు జరుపుకుంటూ వ్యాపారాల విషయాలు చర్చిస్తారు. తీసుకున్న రుణ మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు ప్రతి నెల ఒక సభ్యురాలు బాధ్యత తీసుకుంటుంది. తీసుకున్న రుణం చెల్లించిన వెంటనే మళ్లీ కొత్త రుణాల్ని తీసుకుంటూ బ్యాంకుల నిర్వహణలో స్వయం సహాయ సంఘాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే అనుకోని పరిస్థితుల్లో సంఘం సభ్యురాలు మృతి చెందిన పరిస్థితుల్లో ఆ కుటుంబం అప్పు చెల్లించాల్సి వస్తుంది. లేదంటే ఆ గ్రూపులోని తోటి సభ్యులు చెల్లించే పరిస్థితి ఉండేది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలోనే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మహిళల కోసం కొన్ని బీమా పథకాల్ని అమల్లోకి తెచ్చింది. స్త్రీ నిధి రుణాలు ఏటా మూడు జిల్లాల్లో కలిపి రూ.250 కోట్ల వరకు ఇస్తున్నారు. అలాగే బ్యాంకు లింకేజీ కింద కూడా ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.1800 కోట్ల వరకు రుణాలు పొందుతున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి ఆర్థిక సంవత్సరంలో మూడు జిల్లాల్లో కలిపి రూ.2 వేల కోట్ల వరకు రుణాలు పొందుతున్న పరిస్థితి ఉంది. వీటిని క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు.

స్త్రీ నిధి సురక్ష, రుణ, ప్రమాద బీమా పథకాలు

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు మూడు రకాల బీమా పథకాలు అమల్లో ఉన్నాయి. 18-60 ఏళ్ల వయసున్న మహిళలకు బీమా పథకాలు వర్తిస్తాయి. ఈ మూడు రకాల బీమా పథకాల్లో సభ్యులుగా నమోదై చేయబడిన తర్వాత అనుకోని పరిస్థితుల్లో ఆ మహిళ మృతి చెందితే గరిష్టగా రూ.2 లక్షల వరకు బీమా సదుపాయం కల్పించబడుతుంది. రుణం తీసుకున్న తర్వాత ఏదైన కారణాల చేత చనిపోయినా అట్టి రుణాన్ని చెల్లించాల్సిన అవసరముండదు. అలాగే ప్రమాద బీమా పథకంలో సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా అందుతుంది. ప్రమాదం వల్ల చనిపోయినట్టుగా నిర్ధారణ కావాల్సి ఉంటది. అందుకు సంబంధించిన ఆధారాల్ని చూపాలి. అదే విధంగా ఇప్పటికే అమల్లో ఉన్న స్త్రీ నిధి సురక్ష బీమా పథకంలో ఏడాదికి రూ.230 ప్రీమియం చెల్లించాలి. ఇందులో రూ.2 లక్షల బీమా సదుపాయంతో పాటు రుణ వాయిదాలు చెల్లిస్తే అట్టి వాయిదాలు తిరిగి జమ చేయబడతాయి.

15 రోజుల్లో బీమా క్లెయిమ్స్ క్లియర్

స్త్రీ నిధి సురక్షా, రుణ, ప్రమాద మూడు రకాల బీమా పథకాలకు సంబంధించిన క్లెయిమ్స్ 15 రోజుల్లో క్లియర్ చేయబడతాయి. ఆయా పథకాల్లో చేరిన సభ్యులు గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ వెబ్‌సైట్ ద్వారా బాండ్ పత్రాల్ని పొందే వీలుంది. ఆధార్ ఇతర పత్రాల్ని సమర్పించాలి. బాండ్ పొందిన తర్వాత ఏదైన కారణాల చేత మరణిస్తే వారి వివరాల్ని ప్రత్యేక పోర్టర్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. అట్టి వివరాలను పరిశీలించిన తర్వాత 15 రోజుల్లో బామీ క్లెయిమ్ ప్రక్రియ పూర్తి చేయబడుతాయి.

ఎంతో భరోసా:

జ్యోతి, డీఆర్‌డీఓ

బీమా పథకాలు మహిళా సంఘాల సభ్యులకు ఎంతో భరోసా కల్పిస్తాయి. స్వయం సహాయ సంఘాల్లో చేరిన సభ్యుల్లో పేదలే ఉన్నారు. వీరంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీల్లోని పేదలే కావడం వల్ల ఏదైన కారణం చేత మరణిస్తే తీసుకున్న అప్పు వారి కుటుంబాలపైన పడేది. దీంతో ఎంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. స్త్రీ నిధి సురక్షా, రుణ, ప్రమాద బీమా పథకాలు అమల్లో ఉన్నందున చాలా ఉపయోగం జరగనుంది.

ఏసీ రెడ్డి నర్సింహారెడ్డి స్ఫూర్తితో యువత పోరాడాలి





నవతెలంగాణ-కొమురవెల్లి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, జనగామ మాజీ శాసనసభ్యులు, తుది శ్వాస విడిచే వరకు ఎత్తిన ఎర్రజెండా విడవకుండా జీవితమంతా నిరాడరంబరంగా ప్రజా సేవకు అంకితమైన కమ్యూనిస్టు యోధులు అమరజీవి ఏసి రెడ్డి నరసింహారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని, ఆదర్శానికి మారుపేరని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కార్యాలయంలో ఏసీరెడ్డి నరసింహారెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. సత్తిరెడ్డి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా, నైజాం సైన్యాలను ఎదిరించి దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి మట్టుపెట్టాలని, శ్రమకు తగ్గ ఫలితం కావాలని ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొని తుపాకీ తూటాలకు కూడా బలై తీవ్ర గాయాల పాలైనప్పటికీ ఎర్రజెండా ఎత్తుకొని పేద ప్రజలను విముక్తి గావించిన గొప్ప పోరాటయోధుడు ఏసి రెడ్డి నరసింహారెడ్డి అని కొనియాడారు. జనగామ శాసనసభ్యునిగా పార్లమెంటు రంగంలో ఉద్యమించి ప్రజల సమస్యలను చట్టసభల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమించారన్నారు. జీవితం మొత్తం ప్రజల కోసం త్యాగం చేయాలనే లక్ష్యంతో పీడిత ప్రజల విముక్తి కోసం వివాహం చేసుకోకుండా, పార్టీ కార్యాలయంలోనే నివాసం ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ నడుచుకుంటూ, రిక్షాల పైన ప్రయాణం చేస్తూ గ్రామ గ్రామాన ప్రజా పోరాటాలు నిర్వహించారని, జనగామ ప్రాంతంలో ప్రతి గ్రామానికి, కుటుంబానికి ఏసిరెడ్డి నరసింహారెడ్డి అంటే తెలియని వారు ఉండరని, ఆయన సేవలు పొందని వారు లేరని అన్నారు. పాలకవర్గాల అనుసరిస్తున్న బూర్జువా భూస్వామ్య అనుకూల విధానాలకు నిరసనగా కార్మిక వర్గాన్ని, కష్టజీవులను, రైతాంగాన్ని, పేదలను ఐక్యం చేసి అనుక్షణం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించేవాడన్నారు. నేడు చిన్న పదవి వస్తేనే కార్లు, షికార్లు, విలాసవంతమైన జీవితం గడుపుతున్నటువంటి తరుణంలో త్యాగాలకు విలువ లేకుండా పోయిందని, ధనార్జనేధ్యేయంగా పదవులను ఉపయోగించుకొని సంపన్నులుగా మారుతున్నారని కానీ ఏసీ రెడ్డి నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారని ప్రజలే తన ఆస్తిగా తాను చివరి శ్వాస విడిచే వరకు త్యాగం చేసిన గొప్ప నాయకుడని ఆ నాయకుని స్ఫూర్తితో నేడు పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు ఉద్యమించాలని, ఆయన జీవితం నేటి పాలకులకు యువతరానికి ఆదర్శం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్ నాయకులు సాయిలు, బక్కిలి బాలకిషన్, బాలరాజు, అరుట్ల రవీందర్, సార్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, జనగామ మాజీ ఎమ్మెల్యే, జనగామ ప్రాంత సీపీఐ (ఎం) ఉద్యమ నిర్మాత అమరజీవి కామ్రేడ్ ఏసీ రెడ్డి నర్సింహారెడ్డి స్ఫూర్తితో నేటి యువత ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. ఏసీ రెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకట మావో మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన నాయకుడు ఏసి రెడ్డి నర్సింహారెడ్డి రెడ్డి అని అన్నారు. భాంచన్ దొర నీ కాల్మొక్త అనే రోజులు పోవాలని దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి నిర్మూలించాలని సాగిన పోరాట ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో పది లక్షల ఎకరాల భూమి పంచడంతోపాటు పోరాటంలో 4,000 మంది యోధులు అమరులైనారని తెలిపారు. పోరాట ఫలితంగా ప్రజలకు స్వేచ్ఛ లభించడమే కాక పేదలకు భూమి దక్కిందని, దేశంలో భూసంస్కరణల చట్టం తీసుకురావడానికి నాంది పలికిందన్నారు. ఈ పోరాటంలో జనగామ, చేర్యాల ప్రాంతాలలో రజాకార్ల జాగిందార్ల దొరలు, భూస్వాములు చేస్తున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటంలో అగ్ర భాగాన నిలబడిన మహా నాయకుడు ఏసి రెడ్డి నర్సింహారెడ్డి అని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ఇండ్లు, ఇండ్ల స్థలాలు, భూ సమస్యలపై పోరాటాలు చేసి ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించి ప్రజల పక్షాన నిలబడింది సీపీఐ(ఎం) అని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్క మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప మిగతా ఐదు గ్యారెంటీలు అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకుంటే ప్రజలందరిని ఏకం చేసి అమలు చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్ కుమార్, పట్టణ నాయకులు పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, రాళ్లబండి చందు, మేర్గోజు ప్రవీణ్, మండల కమిటీ సభ్యులు దర్శనం రమేష్, గొర్రె శ్రీనివాస్, కనకయ్య శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబర జీవి ఏసి రెడ్డి నరసింహారెడ్డి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 33వ వర్ధంతి సభ
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పీడిత ప్రజల విముక్తి కోసం దున్నేవానికి భూమి కావాలని వెట్టిచాకిరి మట్టు పెట్టాలని కష్టజీవులు అందర్నీ ఐక్యం చేసి భూస్వాముల కబంధహస్తాల నుంచి పీడిత ప్రజలను విముక్తి చేసిన గొప్ప నిరాడంబర జీవి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కమ్యూనిస్టు నేత, జనగామ మాజీ శాసనసభ్యులు అమరజీవి ఏసీ రెడ్డి నరసింహారెడ్డి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అన్నారు. ఆదివారం ఎస్ రెడ్డి నరసింహారెడ్డి 33వ వర్ధంతి సభ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాల స్వామి అధ్యక్షతన సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యాలయంలో చేశారు. ఈ సందర్భంగా ఏసి రెడ్డి నరసింహారెడ్డి చిత్రపత్రికి సీపీఐ(ఎం) నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శశిధర్ మాట్లాడుతూ దున్నేవానికి భూమి కావాలని, వెట్టిచాకిరి మట్టు పెట్టాలని భూస్వాముల కబంధహస్తాల నుంచి పీడిత ప్రజలను విముక్తి చేయడానికి సాగిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలందరినీ ఐక్యం చేసి భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలందరినీ ఏకం చేసి పోరాటం చేసిన గొప్ప నాయకుడు ఏసి రెడ్డి నరసింహ రెడ్డి అని కొనియాడారు. ప్రజలే తన ఆస్తిగా ప్రజా ఉద్యమాలే ఊపిరిగా జీవిత చరమాంకం వరకు కష్టజీవుల రాజ్యం కోసం తనకంటూ ఏమి లేకుండా త్యాగం చేసిన గొప్ప త్యాగధనుడన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం తన ఇల్లుగా, పెళ్లి చేసుకోకుండా జీవితం మొత్తం ప్రజల కోసం అంకితం చేసిన గొప్ప కమ్యూనిస్టు నేత అని బ్రతికినంత కాలం చాలా నిరాడంబరంగా శాసనసభ్యునిగా గెలిచినప్పటికీ రిక్షాలో ప్రయాణించి కాలినడకన గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన గొప్ప నిరాడంబర జీవి ఏసి రెడ్డి నరసింహారెడ్డి అని అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కష్టజీవుల రాజ్యం కోసం ఎత్తిన ఎర్రజెండాదించకుండా పోరాడిన గొప్ప నాయకుడు అన్నారు. నేడు పాలకవర్గాలు ప్రజలపై భారాలు వేస్తూ పెట్టుబడుదారులు కార్పొరేట్ శక్తుల భూస్వాముల ప్రయోజనాలు నెరవేర్చే విధంగా విధానాల అనుసరిస్తూ కష్టజీవులను మరింత పేదలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాలు ఏసి రెడ్డి నరసింహారెడ్డి స్ఫూర్తితో నిర్వహించాలని, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్ నాయకులు కొండం సంజీవ్, చెప్యాల బాలమని, వంగ రవీందర్ రెడ్డి, తాడిశెట్టి ఆంజనేయులు, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్లో సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-నంగునూరు

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి, మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశం నిర్వహించారు. భూమిగారి రాజేందర్ చేతుల మీదుగా హలో మాదిగ చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. భూమిగారి రాజేందర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని, మాదిగలకు పెద్దన్న పాత్ర వహిస్తానన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట తప్పారని ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 6న తలపెట్టిన జంతర్ మంతర్ వద్ద వంగపల్లి మహాదీక్షను విజయవంతం చేయాలని కోరారు. మాదిగ, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి గడ్డం వెంకటేష్, నంగునూరు మండలం ప్రధాన కార్యదర్శి దేవులపల్లి బొక్కల రాజు, నంగునూరు మండల అధికార ప్రతినిధి దేవులపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు దేవులపల్లి కనకయ్య, సుంచు తిరుపతి, బెజ్జంకి సంజీవ్, భూమి విజయ్, మద్దూరు మండల కార్యదర్శి చిలుక శోభన్, దేవులపల్లి కరుణాకర్, దేవులపల్లి సాయిలు, తిరుమణి బాల నరసయ్య పాల్గొన్నారు.

రచయితల సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

మెదక్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని కాకతీయ నగర్ రామాలయంలో పుస్తకావిష్కరణ, మెరసం పురస్కారాలు, కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త రుక్మాభట్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన 5 మెరసం పద్యరత్నాలు, శ్రీ లక్ష్మీ శతకం, శ్రీ గురు లీలామృతం, రాణి శంకరమ్మ, సుధీమణి శతకం పుస్తకాల ఆవిష్కరణ వాటి సమీక్షలు చేపట్టారు. అనంతరం సిరిసనగండ్ల వేంకటరమణాచార్యుల అధ్యక్షతన డాక్టర్ ఆచార్య వేణుకు " ప్రవచన సుధాంశు" బిరుదు, మార్గం కృష్ణమూర్తి, దీపక్ న్యాతి, అద్దంకి లక్ష్మికి మెరసం పురస్కారాలు అందజేశారు. అనంతరం కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా అంజయ్య, మాడుగుల భాస్కర శర్మ , మంగళంపర్తి వెంకటేశం, పల్లె పెంటారెడ్డి, ప్రత్యేక అతిథులుగా కౌన్సిలర్ కొల్లూరి మల్లేష్, శ్రీపాద రామ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మజస్వామి, మెదక్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ముడుంబై ఆచార్య పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి సూర్య నారాయణశర్మ ఉపాధ్యక్షులు కాశీనాథ్, కోశాధికారి బస్వరాజు, పెన్షనర్ల సంఘం జనరల్ సెక్రటరీ రాములు, మెరసం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మనూర్



కెవిపిఎస్ ఆధ్వర్యంలో మనూరు మండల కేంద్రం లో ఉన్న ఎస్సీ హాస్టల్లో కేవీపీఎస్ నాయ కులు ఆదివారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సంద ర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమై 45 రోజులు అవుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

జీవితంలో అన్నిటికంటే విలువైనది కంటి చూపు

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్

నవతెలంగాణ జహీరాబాద్



మనిషి జీవితంలో అన్నిటికంటే విలువైనది కంటి చూపు అని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పద్మ శాలి భవన్‌లో మెడ్విజన్ వారి సౌజన్యంతో ఉచిత కంటి శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంతోమంది విశ్రాంత ఉద్యోగులు కంటి చూపుతో బాధపడుతున్నందున ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరంలో విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి చికిత్సలు నిర్వహించారు. కొంత మందికి కంటి అద్దాలు మార్చడం,క్యాట్రెట్ ఆపరేషన్ అవసరం ఉన్న వారు సిద్ధంగా ఉంటే మేడ్విజిన్ ద్వారా ఆపరేషన్ చేయించుకోవాలన్నారు. సంఘ అధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం ఏర్పాటుకు సహకరించిన మెడ్విజిన్ సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పటేల్ రాజేందర్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ బస్వరాజు , కోశాధికారి రమేష్ బాబు, సంఘ బాధ్యులు అజిమోద్దిన్, జి.చంద్ర శేఖర్ , బాగా రెడ్డి, మహ్మద్ గౌరి , యూసఫోద్దిన్, రాచన్న ఏస్.నర్సిములు, ఈశ్వరప్ప, వీరన్న, గడ్డం నాందేవ్ , మండల పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో ప్రముఖులు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రపురం భారతి నగర్ తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రాంతాలలో ఆదివారం ఆషాడమాసం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, శాసనమండలి మాజీ ప్రోటెమ్ చైర్మన్ భూపాల్ రెడ్డి, రామచంద్రాపురం, భారతి నగర్ కార్పొరేటర్లు పుష్ప, సింధు, తెల్లాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ లలిత, వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఆలయాల కార్యవర్గం ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని ఆలయాలలో భక్తులు ఉదయాన్నే భక్తి శ్రద్ధలతో వెళ్లి పూజలు, బోనాలను సమర్పించారు.

బోనాల ఉత్సవాల్లో బోనమెత్తిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-వట్ పల్లి

మండలంలోని గొర్రెకల్ గ్రామంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామంలోని ఎల్లమ్మ దేవతకు గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎల్లమ్మ దేవతకు దేవాలయం నుంచి బోనాల ఊరేగింపును డప్పు చప్పుళ్లతో గ్రామంలోని ప్రధాన రహదారి వద్దకు బోనాలు చేరుకోగానే ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బోనం ఎత్తుకున్నారు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ దేవతకు బోనాల పండుగలో పాల్గొని బోనం ఎత్తుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గ్రామస్తులు కలిసికట్టుగా ఉండి పండుగ ఉత్సవాలలో పాల్గొనడం సంతృప్తిగా ఉందన్నారు. గౌడ సంఘము ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధి పట్ల చూపిస్తున్న ఆసక్తి ఎల్లవేళలా ప్రతి సంవత్సరము ఎల్లమ్మ తల్లికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఎల్లమ్మ ఆశీస్సులు తోడుగా ఉంటాయన్నారు, నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గౌడ సంఘం కోరిక మేరకు మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు, అదేవిధంగా గౌడ సంఘం అధ్యక్షతన జోగినిలు పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ రజనీకాంత్ వీరారెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బసవరాజు సిద్ధ రామప్ప సుభాష్ గౌడ్ మహమ్మద్ గని, దేవునూర్ చంద్ర శేఖర్ కోరుమని యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

సోలక్ పల్లిలో మన్ కీ బాత్‌పై బీజేపీ సమావేశం



నవ తెలంగాణ-జిన్నారం

భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతి నెల 4వ ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని జిన్నారం మండల బీజేపీ శ్రేణులు సోలక్ పల్లి గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటైన కార్యక్రమంలో వీక్షించారు. ఈ కార్యక్రమానికి అమీన్పూర్ కౌన్సిలర్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్ల రమేష్, జిన్నారం మండల అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి, దోమడుగు రమేష్, మధుసూదన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు మద్దూరి రాజు, వై వెంకటేష్, కమ్మరి కృష్ణ, శంకర్ లక్ష్మణ్, బి వెంకటేష్, సిహెచ్ వెంకటేష్, కే ప్రవీణ్, మంగంపేట రాజ భార్గవ్, బి మహేష్, ఏ వెంకటేష్ సతీష్, సాయి, ప్రవీణ్ కుమార్, సిహెచ్ ప్రవీణ్, సిహెచ్ శేఖర్, వికాస్ బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

మర్కటాలు... మా పాలిట సంకటాలు

- బెంబేలెత్తుతున్న పిల్లలు వృద్ధులు
- ఇళ్లల్లోకి స్వైర విహారంతో జంకుతున్న మహిళలు
- షాపులు, ఇల్లు, వీధుల్లో గుంపులు గుంపులుగా కోతులు
- భయాందోళనలో జిన్నారం వాసులు
- ఏళ్ల తరబడిగా సమస్య? అయినా పరిష్కారం ఎన్నటికో?





నవ తెలంగాణ-జిన్నారం

అడవుల్లో సంచరించాల్సిన వానరాలు ఊళ్ళపైకి తెగబడుతున్నాయి ఫలితంగా జనాలు బిక్కు బిక్కుమంటూ బెంబేలెత్తిపోతున్నారు. ఈ తతంగం ఎప్పుడు ఎక్కడో ఓ చోట అనుకుంటే పొరబడినట్టే... మండల కేంద్రమైన జిన్నారంతో పాటు పరిసర గ్రామాల్లో కోతుల బెడద నిత్యకృత్యంగా మారిందంటూ స్థానిక జనాలు తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లోంచి బయటకు వెళ్లాలంటే ఏ వైపు నుంచి కోతుల గుంపు వచ్చి దాడి చేస్తుందోనని, ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందోనంటూ పలువురు తమ నిస్సహాయ పరిస్థితిని ఆవేదన భరితంగా వెల్లడిస్తున్నారు. వీధుల్లో వాడల్లో ఇళ్లపై ఒకేసారి సమూహంగా వస్తున్న కోతులు జనాల చేతిలో సంచీలు, ఆహార పదార్థాలు, చిన్నపిల్లలు, వృద్ధుల చేతుల్లో కనిపించే తినుబండారాలు ఇతరత్రాలను చూసి ఒక్కసారిగా మనుషులపైకి దూకి సదరు వస్తువులను లాక్కుపోవడంతో పాటు తీవ్రంగా గాయపరుస్తున్నాయన్నారు. ఫలితంగా వృద్ధులు పిల్లలు తీవ్రమైన భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లల్లో వంటగదిల్లోకి ప్రవేశించి వస్తువులను చిందరవందరగా చేస్తూ మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలపై కోతులు దాడులు చేస్తున్న సందర్భాలు మరీ పెరిగిపోతున్నాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వానర మూకలు పరస్పరం దాడులు చేసుకుంటూ వీధుల్లో వాడల్లో తమ తమ పనుల్లో నిమగ్నమైన వారిపై అకస్మాత్తుగా కోతులు దాడులకు తెగబడుతుండడంతో తాము తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నామంటూ పలువురు జిన్నారం ప్రజలు వాపోతున్నారు. వ్యాపార సముదాయాలు, హోటళ్లు, కిరాణా షాపులు, ఆహార పదార్థాలకు సంబంధించిన చోట్లలో, మార్కెట్ రోజుల్లో అంగడి బజార్లలో కోతుల బెడద మరింతగా పెరిగిపోవడంతో తాము అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పలువురు దీనంగా వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో అయితే ఇంట్లోంచి బయటకు రావాలంటే చేతిలో కర్ర ఉంటే గాని బయటకు రాలేని పరిస్థితి దాపురించిందంటూ పలువురు స్థానిక వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళల్లో వీధుల్లో వార్డుల్లో కోతుల బెడద శాపంగా మారిందంటూ వాపోయారు. రోజువారి అవసరాల నిమిత్తం షాపుల్లోంచి సరుకులు తీసుకు వెళ్తున్న సందర్భంలో చేతిలోంచి సంచులను పిల్లల దగ్గర నుంచి తినుబండారాలను కోతులు లాక్కు వెళ్లడం అటుంచితే పైగా గోర్లతో రక్కుతూ పళ్ళతో గాయపరుస్తున్నాయంటూ పలువురు తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగానైతే పంట పొలాలలో ధాన్యం చేతికందే సమయంలో పెద్ద మొత్తంలో కోతులు మందకు మందలా వస్తూ పంటను నష్టం చేయడం, ఆరబోసిన ధాన్యాన్ని చిందరవందర చేయడం లాంటి ఇబ్బందులకు గురైన రైతుల పరిస్థితి సర్వసాధారణంగా తెలిసిందే. దానికి భిన్నంగా నేడు పూర్తిగా కోతులు గ్రామాల్లోనే పూర్తిగా సంచరించడం ఒక్కసారి పెద్ద సమూహంలాగా రావడం వాటిని చూసి చిన్న పిల్లలు వృద్ధులు మహిళలు భయాందోళన గురి కావడం నిత్య కృత్యంగా మారిందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారు జామునే నిద్రలేచి మార్నింగ్ వాక్ వెళ్లే వారిపై కూడా కోతులు దాడులు చేస్తున్న సందర్భాలు తరచుగా జరుగుతున్నాయి. కోతుల దాడుల వల్ల పిల్లలు వృద్ధులు మహిళలు, యువకులు ఆయా ప్రాంతాల్లో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు. కోతుల దాడుల్లో తరచుగా గాయపడుతుండడం వల్ల తాము ఆస్పత్రుల పాలు కావాల్సి వస్తుందంటూ, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంజక్షన్లు కూడా చేయించుకున్న సందర్భాలు ఉన్నాయంటూ వారు గుర్తు చేస్తున్నారు.

గ్రామాల్లోనే కోతులు ఎందుకు స్వైర విహారం చేస్తున్నాయి ?

వన్యప్రాణులు గ్రామాల్లోనే ఎందుకు స్వైర విహారం చేస్తున్నాయంటూ పలువురు ప్రశ్నించుకుంటున్నారు. వానరాలు నివాస ప్రాంతాలైన అడవుల్లో పచ్చని వాతావరణం గతానికి నేటికీ భిన్నంగా మారిపోవడం, పచ్చని అడవులు, సీజన్ల వారీగా వన్యప్రానులకు దొరికే ఆహార పదార్థాలు ఇతరత్రాలు కరువైపోవడం, ఫలితంగా వానరాలు గ్రామాలపైకి తెగబడుతున్నాయంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. అడవులు నరికివేతకు గురికావడం, పట్టణ ప్రాంతాల విస్తరణ పేరిట, పరిశ్రమల విస్తరణ, రహదారుల అభివృద్ధి నెపంతో అడవులు తగ్గిపోతుండడం ఫలితంగా వానరాలు ఇతర వన్యప్రాణులకు సహజ సిద్ధంగా లభించే ప్రకృతి ప్రసాదంగా భావించే వన్యప్రాణుల ఆహార పదార్థాల కొరత నేపథ్యంలో జనసంచారంలోకి అవి రావడం సహజ సిద్ధంగా జరిగిపోతుందంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నేడు కోతుల మందలు వివిధ గ్రామాల్లో ఇబ్బంది ముబ్బడిగా కనిపిస్తూ జనాల పాలిట శాపంగా మారాయంటున్నారు. పచ్చని వాతావరణం పెంచడం, అటవీ సంపదను పెంపొందించడం, చెట్లను పెంచడం, తద్వారా ఆయా సీజన్లో వన్యప్రాణులకు అందాల్సిన కాయలు పండ్లు ఇతరత్రాలు సహజ సిద్ధంగా లభించే వాతావరణాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి అత్యంత అవసరమైనదిగా గుర్తించాలని పలువురు సూచిస్తున్నారు.

అధికారులు సమస్య మీకు పట్టదా?

మండల కేంద్రమైన జిన్నారంతో పాటు ఆయా గ్రామాల్లో కోతులు తీవ్రంగా ఉండడం వృద్ధులు పిల్లలు మహిళలు జనాలు కోతుల మంద దాడులతో తీవ్రమైన అగచాట్లకు గురవుతుండడం పరిపాటిగా మారినా అధికారులకు ఏమాత్రం సమస్య పట్టనట్లుగా పరిస్థితిని తాము ఎదుర్కొంటున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. అటవీశాఖ అధికార యంత్రాంగం ఇప్పటికైనా సమస్యను గుర్తించి జనాలకు ఇబ్బందికరంగా మారిన కోతుల బెడద సమస్య నుంచి శాశ్వతమైన పరిష్కారం లభించే విధంగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అవసరమైతే కోతుల మందలను జిన్నారం మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలించేందుకు ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలను రూపొందించుకొని అధికార యంత్రాంగం తగిన చర్యలకు ఉపక్రమించి జనాలకు కోతుల బెడద నుంచి ఉపశమనం కల్పించాలని పలువురు వృద్ధులు, మహిళలు, గృహిణులు పిల్లలు కోరుతున్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలకు డిమాండ్

నవ తెలంగాణ-జిన్నారం



జిన్నారం మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కాలుష్య జలాల వ్యర్థ రసాయనాలు విడుదల పారబోతకు సంబంధించి ఈ ప్రాంత జనావళి ప్రజారోగ్యానికి కంటకంగా మారింది. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న పరిశ్రమలపై తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని కాజిపల్లి జేఏసీ కమిటీ చైర్మన్ దండే రమాకాంత్ బృందం డిమాండ్ చేశారు. జిన్నారం మండల పరిధిలోని ఖాజీపల్లి, గడ్డపోతారం, కిష్టాయిపల్లి, అలీనగర్‌లతో పాటుగా గండిగూడెం గ్రామాల పాలిట తీవ్రమైన కాలుష్యం శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రామ్‌కీ ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్, హెటెరో ల్యాబ్స్ మోడల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ వల్ల కలిగే తీవ్రమైన పర్యావరణ కాలుష్యం అంశాలను వివిధ రసాయన పరిశ్రమల కార్యకలాపాల నేపథ్యంలో విడుదలవుతున్న రసాయన ఘన కాలుష్య పరిస్థితులు, వాయు కాలుష్యం, భూమి కాలుష్యం, నీటి కాలుష్యం కారణంగా పచ్చని పంట పొలాలు, ప్రజారోగ్యం, సహజసిద్ధమైన వాతావరణం ప్రకృతి సంపద పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికిగాను తగు చర్యలు నిమిత్తమై పలుమార్లు కాలుష్య నియంత్రణ మండలి అధికార యంత్రాంగానికి జిల్లా అధికార యంత్రాంగానికి సమస్యను నివేదించినట్లు జేఏసీ చైర్మన్ దండే రమాకాంత్ బృందం తెలిపారు. కాలుష్యం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగం వెంటనే కార్యాచరణకు దిగాలని వారు కోరారు. దీనిలో భాగంగానే పర్యావరణ ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరపాలని, కాలుష్యం కలిగించే పరిశ్రమలు సంస్థలపై కఠినమైన చర్యలు తీసుకొని, జరిమానాలను విధించాలని, కాలుష్య నియంత్రణ చేపట్టాలని బాధిత వర్గాలకు పరిహారం పునరావాసం కల్పించాలని వారు కోరారు. కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారం కోసం కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు కాజిపల్లి జేఏసీ చైర్మన్ దండే రమాకాంత్ బృందం తెలిపారు.

ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు ఉత్తమ స్టార్ ఈఎంటి అవార్డు

నవతెలంగాణ-కల్హేర్



సంగారెడ్డి లోకేషన్ ఎంసిహెచ్ 108 అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న నీరుడి ప్రవీణ్ క్షత గాత్రులను కాపాడడంతో పాటు పిసిఆర్ డాక్యుమెంటేషన్ కరెక్ట్‌గా చేసినందుకుగాను తెలంగాణ రాష్ట్ర స్టేట్ లెవెల్ ఉత్తమ స్టార్ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి)గా అవార్డు అందుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్, సంగారెడ్డి ఈఎంఈ షేక్ శాలి హుస్సేన్ ఇన్ స్ట్రక్టర్ ప్రమోద్‌లు ఈ అవార్డును ప్రవీణ్‌కు అందజేశారు. కల్హేర్ మండలంలోని మీరాన్ పేట గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ 108 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సర్వీస్‌లో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వివిధ సమయాలలో వివిధ రకాల ఘటనలు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులను అవసరమైన అత్యవసర ప్రథమ చికిత్సను 108 వాహనంలోనే అందించి బాధితులను ప్రాణాపాయం నుంచి ప్రవీణ్ రక్షించారు. వారి విలువైన ప్రాణాలను కాపాడటంలో అత్యుత్తమ ప్రదర్శనకుగాను సంగారెడ్డి జిల్లా కేంద్రం ఎంసి హెచ్ 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కు స్టేట్ లెవెల్ ఉత్తమ మెడికల్ టెక్నీషియన్ స్టార్ ఈఎంటి అందుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు పీఎం జనార్దన్ ఈఎంఈ హుస్సేన్ ఇన్ స్ట్రక్టర్ ప్రమోద్‌కు శుభాకాంక్షలు తెలిపి, ప్రవీణ్‌ను అభినందించారు. అవార్డు అందుకున్న ప్రవీణ్ మాట్లాడుతూ ఈ అవార్డు ఉన్నతాధికారులు పీఎం జనార్ధన్ ఈఎంఈ హుస్సేన్ ప్రోత్సాహంతో వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఈఎంటి ప్రవీణ్ పిసిఆర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ హరిశంకర్ వెంకటేశం లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి ఈఎంటిలు, పైలట్లు పాల్గొన్నారు. సంగారెడ్డి సిబ్బంది ఈఎంటిలు ప్రశాంత్ కుమార్, సంగమేశ్వర్, శంకర్ నాయక్, రాజిరెడ్డి, జైపాల్ నాయక్ ఇంతియాజ్ విజయ్ రఘురాం అరుణ్, నర్సిగౌండ ,పైలెట్లు జగన్ పటేల్, కృష్ణమూర్తి గౌడ్, సంతు, జగదీష్, షరీఫ్, నరేష్, తదితర సిబ్బంది, పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర ఉత్సవాలు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ బోనాల కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పటు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నవతెలంగాణ-మనూర్

మండలంలోని దోసపల్లి గ్రామంలో ఆదివారం బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, హోమం, అభిషేకం చేశారు. అనంతరం మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామ విధుల గుండ ఊరేగింపు చేశారు. పోతురాజులు వారి వేషధారణలో నృత్యంచేస్తూ అట పాటలతో నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాట్లుచేశారు. అమ్మ వారికి బోనాలు పూజలు చేసిన తరువాత రథంలో ఊరేగింపు నిర్వహించారు. యువకులు పెద్దలు అందరు కలిసి డిజే పెట్టిడ్యాన్స్ ఉల్లాసంగా గడిపారు. ఖేడ్ ఎమ్మెల్యే డా పి. సంజీవ్ రెడ్డి బోనా ఉత్సవాలలో పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు బోనాలు నిర్వహించడం సంతోషకరమని అందరికి శు భాకాంక్షలు తెలిపారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి సుధాకర్ రెడ్డి, పి చంద్రశేఖర్ రెడ్డి. దిగంబర్ రెడ్డి బ్రహ్మానంద రెడ్డి, అశోక్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, సుభాష్ రావు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంతోపాటు ఊట్ల, అలీ నగర్, మంగంపేట గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సవాల మధ్య సాంప్రదాయ నేపద్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, బోనాల ఊరేగింపు, అమ్మవారికి బోనాల సమర్పణ, ప్రత్యేక కార్యక్రమాలు ఆయా గ్రామాల్లో నిర్వహించారు. మండల కేంద్రమైన జిన్నారంలో విశ్వకర్మ నేతృత్వంలో బోనాల పండగ ఉత్సవాన్ని ప్రత్యేకంగా చేపట్టారు.

నవ తెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల ప్రజలు జంగంపేట గ్రామంలో బోనాల పండుగ ఉత్సవాలను ఆదివారం ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన జాతర ఊరేగింపు కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారికి ప్రత్యేక పూజ, బోనాల ఊరేగింపు, బోనాల సమర్పణ, తదితర కార్యక్రమాలు చేపట్టారు. చిన్నలు పెద్దలు ఒకరికొకరు పండుగ శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాయకులు యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవ తెలంగాణ-కోహిర్

మండలంలోని బిలాల్పూర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ అమ్మవారికి బోనాలతో ఊరేగింపు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పోచమ్మ అమ్మవారికి సమర్పించారు. ఆటపాటలతో బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె నర్సింలు మాజీ సర్పంచ్ ఎం నర్సింలు మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఉపసర్పంచ్ శైలజ నర్సింలు, ఎం రవి నాగరాజు, కిష్టయ్య యాదయ్య భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.











స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ నాయకులు నగేష్ యాదవ్, అనిల్ రెడ్డి



నవతెలంగాణ-కల్హేర్,

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపి అసెంబ్లీ కో కన్వీనర్ జీ.నగేష్ యాదవ్, కల్హేర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు యెన్నం అనిల్ రెడ్డి అన్నారు. వారు ఆదివారం మండలంలోని మహాదేవ్ పల్లి కూడలిలో గల వెంకటాద్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. హామీల అమలులో అధికార కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు యెన్నం అనిల్ రెడ్డి, సీనియర్ నాయకులు సంగమేశ్వర్ రావు, రాపర్తి మాజీ సర్పంచ్ శ్రవణ్, మండల ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు సంతోష్, పండరి, చంద్రశేఖర్, నర్సింలు, కిష్టయ్య, విఠల్, రవితేజ, సాయిలు, నరేందర్, రాజు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

- పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం బోనాల జాతర ఉత్సవాలను మున్సిపల్ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిఏ బస్తి, పోచమ్మ బస్తీలలోని పెద్దమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆషాడ బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రత్యేకగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాల్ రాజ్, దీనానాథ్, బషీర్, రవీందర్ రెడ్డి, చక్రపాణి, వెంకటయ్య శ్రీను, ఉపేందేర్, మణి, ఉత్సవ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-నర్సాపూర్



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఆదివారం సాయి కృష్ణ కళ్యాణమండపంలో పీఆర్‌టీయూ నర్సాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎంఈఓ బుచ్చా నాయక్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయాడం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, కేజీబీవీ రాష్ట్ర నాయకులు స్వరూప, సామ్య నాయక్, జిల్లా కార్యదర్శిలు వీరేశం, ప్రసన్నకుమార్, లాలు, సత్యనారాయణ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, చందర్, చెన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-పెద్దశంకరంపేట



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన పెద్దశంకరంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పెద్దశంకరంపేట శివారులో ఎదురెదురుగా బైక్, ఎలక్ట్రికల్ బైక్ ఢీకొనడంతో వీటిపై ప్రయాణిస్తున్న పెద్దశంకరంపేటకు చెందిన విజయ్, పిట్లం మండలానికి చెందిన రమేష్‌కు గాయాల య్యాయి. వీరిని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి హైవే అంబులెన్స్లో తరలించారు. పోలీసులు సంఘ టనాస్థ లానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

మహంకాళి జాతరలో ప్రత్యేక పూజలు

-వంటేరు ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్



ఉజ్జయిని మహంకాళి జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వంటేరు ప్రతాప్ రెడ్డి తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ, మాజీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అమ్మవారికి ఆదివారం రోజున ప్రత్యేకమైన పూజలు నిర్వహించి ఆశీర్వాదం పొందారు. మహిళలకు బోనం ఎత్తి అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు పులిహోర వడ్డించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ బొంది రవీందర్ గౌడ్, మనోహరాబాద్ మాజీ ఎంపీపీ పురం నవనీత రవీందర్, కౌన్సిలర్లు మామిడి వెంకటేశం, ఉమా సత్య లింగం, అరుణ రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు మన్నె శ్రీనివాస్, పల్లె ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సతీష్ చారి, రహీం, ఎంపీటీసీ సంతోష్ రెడ్డి, సామల అశోక్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సామల అశోక్, యువజన నాయకులు శ్రీకాంత్, ఆంజనేయులు, నర్సింలు, నర్సింగరావు, రామస్వామి, మహిళలు, ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లకు బోనాలు సమర్పణ

నవతెలంగాణ - నార్సింగి



మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక మాత ఎల్లమ్మ తల్లికి ఆషాఢం బోనాలు సమర్పించారు. ఆదివారం గ్రామంలో అమ్మోరు పోచమ్మ తల్లికి ముందుగా బోనాలు సమర్పించి అనంతరం రేణుక మాత ఎల్లమ్మ తల్లికి బోనాలు తీసి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఆషాఢమాసం వ్యాధులు ప్రబలే కాలం కావడం వలన గ్రామంలో చెడు పోవాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు బోనాలు తీసి పచ్చ బువ్వ, ఆకుకూర వంటలతో, కల్లు శాఖలతో అమ్మవార్లను పూజిస్తుంటామని గ్రామస్తులు తెలిపారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండి సిరి సంపదలతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని అమ్మవార్లకు వేడుకున్నామని, ఈ సందర్భంగా భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద గౌడ సందిగారి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షులు తాళ్ళ చిన్న కృష్ణ గౌడ్, శివ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాడ బోనాలు

-బోనమెత్తిన నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల కేంద్రంలో పాటు రైలాపూర్ సదాశివ పల్లి కంచన్పల్లి ఆషాడ బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి హాజరై బోనం ఎత్తుకున్నారు. మదన్ రెడ్డి మాట్లాడుతూ కౌడిపల్లి మండల వ్యాప్తంగా ఆషాడ బోనాల నిర్వహించడం సంతోషకరమని ఆ పోచమ్మ, ఎల్లమ్మ దయవల్ల ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మెన్ చిన్న రెడ్డి, మాజీ సర్పంచ్ శివ ఆంజనేయులు గౌడ, జన హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రం దుర్గ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్, పోల జనార్దన్ ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు మాటూరి యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు భుజంపేట మల్లేశం, డాక్టర్ దుర్గేష్, మోతిలాల్ గౌడ్, రైలాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కురుమశేకులు, బీసీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు

కిష్టాపూర్ సొసైటి డైరెక్టర్ అనారోగ్యంతో మృతి

-సంతాపం వ్యక్తం తెలిపిన సుహాసిని రెడ్డి

నవతెలంగాణ-కొల్చారం



కిష్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎరుకల ముత్తయ్య (56) గత కొంత కాలంగా అనారోగ్య బారిన పడి చికిత్స పొందుతున్నారు. అయితే ఇటీవల పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు చిలుముల సుహాసినీ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కిష్టాపూర్ పీఏసీఎస్ చైర్మెన్ నాగుల మల్లేశం గౌడ్‌లు అక్కడికి చేరుకుని ఎరుకల ముత్తయ్య అకాల మరణానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరుకల ముత్తయ్య అకాల మరణం చెందడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. అంత్యక్రియల్లో మాజీ సర్పంచ్ గోదావరి, గ్రామ శాఖ అధ్యక్షులు పెద్ద శ్రీశైలం, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోష్యా నవీన్, పీఏసీఎస్ డైరెక్టర్లు అక్కెం శ్రీనివాస్, పసల సత్యనారాయణ, ఏంబరి శేఖర్, పసుల నారాయణ, సత్యం, పెద్దల కిషన్, యాదగిరి, మల్లేశం, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ ఎంచర్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవాని అమ్మవారికి బోనాలు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



మండలంలోని భవాని మాత అమ్మవారికి ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. భాజా భజంత్రీలతో మహిళలు బోనాలు ఎత్తుకొని భవాని మాత అమ్మవారి దేవాలయానికి, చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయంలో ఉదయం నుంచి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుతో అమ్మవారికి బోనాలు సమర్పించి చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్తలు ఆర్యన్, సంతోష్ కుమార్, అరుణ్, శ్రీనివాస్, శివకుమార్, విశ్వనాథం, సుభాష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

థండర్స్ క్రికెట్ టీం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ తండర్స్ క్రికెట్ టీం ఆధ్వర్యంలో ఆదివారం తూప్రాన్ పట్టణంలోని శ్రీశ్రీ ఉజ్జయిని మహంకాళి జాతరకు విచ్చేయుచున్న భక్తులకి పులిహోర, నీళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తండర్స్ క్రికెట్ టీం సభ్యులు పాల్గొన్నారు

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులకు కట్టడి

- చేగుంట మండలం చైత్రం రామ్ తండాలో డెంగ్యూ లక్షణాలు
- జిల్లా ప్రభుత్వ వైద్యాధికారి పర్యటన పరిశీలన కుదుటపడ్డ కేసులు





నవతెలంగాణ-చేగుంట

వర్షాకాల సీజన్ ప్రారంభమైంది. ఈ కాలంలో ఎక్కువగా సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుంటాయి. అందులో విష జ్వరాలు, చికెన్ గున్యా, అలాగే దోమకాటుతో డెంగ్యూ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. వర్షం నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో లార్వా వృద్ధి చెంది దోమగా ఎదిగి డెంగ్యూ రూపంలో ప్రజల ప్రాణాలను తోడేస్తుంది. చుట్టుముట్టు పరిసరాలను పరిశుభ్రత పాటించకుండా, మురికి కాలువలు శుభ్రపరచకుండా ఉన్న స్థలంలో లార్వాలు వృద్ధి చెంది దోమలుగా ప్రజలను కాటేస్తున్నాయి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే సీజనల్ వ్యాధులు ప్రభలుతాయి. చుట్టు పరిసర ప్రాంతాలలో మురుగు నీరు నిల్వ ఉన్నట్లయితే వాటితో వచ్చే వ్యాధులు మలేరియా డయేరియా ఎక్కువగా వస్తాయి. కాబట్టి ఈ వర్షాకాల సీజన్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ వర్షాకాల సీజన్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా, హౌజులు డ్రమ్ములు, మురికి కాలువలు, నీటి గుంతలలో వీటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పరిసర ప్రాంతాలు ఎప్పటికీ అప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి. వేడి ఆహార పదార్థాలు ఇంట్లో తయారు చేసినవి మాత్రమే తీసుకోవాలి. కాచి వడబోసి చల్లారిన నీటిని తాగాలి. వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఒకవేళ జ్వరాలు, తేలికపాటి జలుబులు వచ్చినట్టయితే స్వంతంగా ఎటువంటి మందులు వేసుకోరాదు. డాక్టర్ల సలహాలు సూచనలు మేరకే మందులు వాడుకోవాలి.

చైత్ర రామ్ తండాలో డెంగ్యూ లక్షణాలు

కుదుటపడ్డ డెంగ్యూ కేసులు

మండలంలోని చైత్రం తండాలో ఇటీవల ఓ కుటుంబంలో డెంగ్యూ లక్షణాలు కనిపించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ గ్రామాన్ని జిల్లా ప్రభుత్వ వైద్య అధికారి, మండల వైద్యాధికారి పరిశీలించి, 20 మంది బ్లడ్ శాంపిల్ సేకరించి ల్యాబ్ టెస్టులకు పంపించారు. గ్రామంలో డెంగ్యూ లక్షణాలు వచ్చిన ఆ ఇంటి పరిధిలో వాడి పడేసిన టైర్లు, నీటి గుంటలలో నీరు నిల్వ ఉండడంతో అక్కడ దోమలు వృద్ధి చెంది వీరికి డెంగు లక్షణాలు కనిపించాయని, వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందితో సహా వాటినన్నిటిని తొలగించారు. ప్రత్యేక ఆరోగ్య శిబిరంను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఈ గ్రామంలో డెంగ్యూ కేసులు కుదుటపడ్డాయని జిల్లా ప్రభుత్వ వైద్యాధికారి శ్రీరామ్ తెలిపారు.

ఉప కేంద్రాల్లో ప్రతి రోజు వైద్యసేవలు

చేగుంట ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ అనిల్ కుమార్

మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 8 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయని, చేగుంట పట్టణ కేంద్రంలో ఏ, బి, కేంద్రాలు, అలాగే వడియారం, రెడ్డిపల్లి, మక్క రాజుపేట, గొల్లపల్లి, చందాయి పేట, చెట్ల తిమ్మాయిపల్లి, ఈ గ్రామాలలో ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ప్రతిరోజు వైద్య సేవలు అందిస్తున్నారని, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, డెలివరీ కేసులు, దీంతోపాటు ఎటువంటి వ్యాధులు సోకిన వారికి నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఈ వర్షాకాల సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలోనే ఆశ వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ పర్యవేక్షణ చేస్తున్నారు. వారి సలహాలు సూచనలు మేరకే మందులు వాడుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు మాత శిశు సంరక్షణ కార్డులు వారంలో రెండు రోజులు చూడడం జరుగుతుందన్నారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలంటే సరైన పోషక ఆహారం తీసుకోవాలన్నారు.

ముమ్మరంగా వానా కాలం పంటల నమోదు

నవతెలంగాణ-పెద్దశంకరంపేట



వానాకాలం పంటల నమోదు ప్రక్రియ మండలంలో ముమ్మరంగా సాగుతుంది. మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాల వద్దకు వెళ్లి సాగు వివరాలు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. ఆగస్టు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. ఈ మేరకు ప్రస్తుతం పత్తి వరి కంది పెసర మినుము తదితర పంటల లెక్కలు తేలుస్తున్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం బ్యాంక్ అకౌంట్ బుక్ ఆధార్ ఫోన్ నెంబర్ వివరాలను ఆన్లైన్లో నిక్షిప్తం చేస్తున్నారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా కార్యచరణ రూపొందించారు.

సుమారుగా 21500 ఎకరాల పంటసాగు

మండలంలో పత్తి, వరి, మినుము, కంది, పెసర తదితర పంటలు సుమారుగా 21500 వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా, అందులో 3500 వేల ఎకరాలలో పత్తి 18000 వేల ఎకరాలలో వరి సాగు చేస్తారని మండల వ్యవసాయ అధికారులు అంచనా వేశారు ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచారు ఇప్పటివరకు మండలంలో 21500 ఎకరాలలో పంటలు సాగు చేయగా, వరి పెసర మినుము తదితర పంటలు కలిపి 19000 ఎకరాల పంటల వివరాలు ఆన్లైన్లో నమోదు చేశారు. పంటల వివరాల నమోదు ప్రక్రియను ముగ్గురు ఏవోలకు పది గ్రామలా చొప్పున వేగంగా పూర్తి చేసేలా జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పక్కగా నమోదు

ఏటా వానకాలం యాసంగి సీజన్లో మండలంలో వరి పత్తి మొక్కజొన్న పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. పంట పేరు సాగు విస్తీర్ణం వివరాలు నమోదు చేయకుంటే పంటలు విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన తర్వాత ఆన్లైన్లో ఉన్న దిగుబడి ఉండాలి. తేడాలు ఉంటే చెల్లింపులు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. దీంతో పంటల నమోదుకు రైతులు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు

ముమ్మరంగా పంటల నమోదు

ఏడి యాదగిరి



మండలంలో పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగ కొనసాగుతుంది. ఒకటి రెండు రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తి అవుతుంది. వరి నాట్లు పూర్తవగానే వరి పంట వివరాలు పూర్తి చేస్తామన్నారు పంటల వివరాలు నమోదు ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఏవోలకు సూచనలు చేస్తున్నామన్నారు మండల పంటలు వివరాలు సర్వేను ఏడి యాదగిరి పర్యవేక్షిస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు పత్తి 3500 ఎకరాలు, వరి 18000 ఎకరాలు, కంది 160 ఎకరాలు, పెసర 60 ఎకరాలు, మినుము50 ఎకరాలు నమోదు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న నాయకులు

- నేనంటే నేనంటూ సిద్ధమవుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజాంపేట



రాష్ట్ర ప్రభుత్వము స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మండలంలో ఒక్కసారిగా నాయకులు అలర్ట్ అయ్యారు. గత స్థానిక సంస్థల ఎన్నికల మాదిరిగానే ప్రస్తుతం రిజర్వేషన్లు ఉంటాయని ప్రభుత్వము చెప్పడంతో నాయకులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మొన్నటి వరకు రిజర్వేషన్లు ఏ రకంగా ప్రభుత్వము ప్రకటిస్తదో అనే అయోమయంలో ఉన్న నాయకులు ప్రస్తుతం మాత్రం ఊపిరి పీల్చుకున్నారు. సర్పంచిని నేనవుతానంటే నేనవుతానంటూ ఇప్పటికే గ్రామంలో చర్చలు కొనసాగుతున్నాయి. నిజాంపేట గ్రామ ఓటర్లు దాదాపుగా 4000 వరకు ఉంటారు. ఎప్పుడైనా సరే నిజాంపేట సర్పంచ్ ఎన్నికలు రసవత్తరంగా జరుగుతుంటాయి. సర్పంచి ఎన్నికలలో ఎన్నో జిమ్మిక్కులు చేస్తుంటారు. ఆ జిమ్మిక్కులతో గెలిచి చివరకు గ్రామాన్ని ఎలాంటి అభివృద్ధి చేయరు. దాదాపు 25 సంవత్సరాల నుంచి సర్పంచ్ ఎన్నికలలో హామీలు ఇచ్చి నేటి వరకు పనులను చేయడంలో సర్పంచులు విఫలమయ్యారని నిజాంపేట గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచులు అంటే గ్రామానికి సేవ చేసే నాయకుడని గ్రామ ప్రజల బాగోగులు చూసుకునే వ్యక్తి అని అనుకునేవారు. కానీ ప్రస్తుతం సర్పంచి పదవి అనేది వ్యాపారంలాగా మారిపోయి సొంతంగా ఆస్తులు సంపాదించుకోవడమే తప్ప ప్రజలకు సేవ చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నికలలో నిలబడి గ్రామానికి ఇది చేస్తా అది చేస్తా అని కల్లిబొల్లి మాటలు చెప్పి ప్రజలకు ఎన్నికలలో గెలిచిన తర్వాత వారి సొంత వ్యాపారాలను చూసుకుంటూ ఆస్తులు సంపాదించుకుంటున్నారే తప్ప ప్రజలకు ఎవరు సేవ చేయడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కుల మతాలకు అతీతంగా నిజమైన ప్రజాసేవకున్ని ఎన్నుకున్నట్లయితే నిజాంపేట గ్రామం అభివృద్ధి చెందుతుందని పలువురు వాపోతున్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు సేవ చేసే వారిని ఎన్నుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏదేమైనా నిజాంపేట సర్పంచ్ ఎన్నికలు మాత్రం రసవత్తరంగా జరుగనున్నాయి.

మంచి నాయకున్ని ఎన్నుకోవాలి

బక్కోళ్ల బాగులు, నిజాంపేట



దాదాపు 25 సంవత్సరాల నుంచి ఎన్నికలలో గెలిచిన తర్వాత నాయకులు గ్రామ అభివృద్ధి విషయాన్ని పట్టించుకోవడంలేదు. ఇప్పటికీ నిజాంపేట గ్రామంలో బస్టాండ్ లేదు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలేదు, జూనియర్ కాలేజ్ లేదు, ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. వీధి దీపాలు లేవు. చిన్న చిన్న గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి కానీ నిజాంపేట మాత్రం అభివృద్ధి చెందడం లేదు. ఇప్పటికైనా నిజాంపేట గ్రామ ప్రజలు సరైన నాయకున్ని ఎన్నుకుని గ్రామ అభివృద్ధికి పాటుపడాలి

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జాగ్రత్త

- ఎస్ఐ అహ్మద్

నవతెలంగాణ-నార్సింగి



ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల పలు ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ హెచ్చరించారు. ఎస్ఐ మాట్లాడుతూ వర్షాల వల్ల రోడ్డు స్పష్టంగా కనబడదని, అందువల్ల రోడ్డు ప్రమాదాల అవకాశాలు పెరుగుతాయని, అత్యవసరం అయితేనే బయటకు వెళ్ళాలని అన్నారు. రైతన్నలకు విద్యుత్ సరఫరా సమస్యలు ఉంటే సంబంధిత ఏఈ, లైన్‌మ్యాన్‌కు ఫిర్యాదు చేయాలని, స్వంతంగా మరమ్మత్తులకు పూనుకోకూడదని, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌లకు దూరంగా, విద్యుత్ పరికరాలు వాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లవద్దని, కొత్త నీరు చేరడం వల్ల లోతు ఎక్కడ ఉంది అన్న విషయం తెలియదని, నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఏక ధాటిగా వర్షం కురుస్తుండటం వల్ల పాత ఇల్లు, పూరిల్ల గోడలు నాని పోయి ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉంటుందని, వాటిలో నివసించే వారు తగిన ఏర్పాట్లు, జాగ్రత్తలు చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చికిత్స తీసుకోవాలని అన్నారు. మండల ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులకు లేక పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కురుస్తున్న వర్షంతో ప్రజల అప్రమతంగా ఉండాలి

- మాజీ ఎంపీపీ జంగ శ్రీనివాస్

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



గత వారం రోజుల్లో ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. రానున్నా రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శిథిలావస్థలోఉన్న ఇండ్లలో నివసించే ప్రజలు జాగ్రత్త తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ కాలువలు, చెరువులు, వాగులు కుంటల వద్దకు ప్రజలు వెల్లరాదన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఎక్కడైనా ఇనుప స్తంభాలు పరికరాలు ఉంటే పిల్లలను వాటిని ముట్టుకోకూడదని చెప్పారు. రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండి విద్యుత్ ట్రాన్సుర్లు వైర్లు వంటివి తాకకుండా రైతులు ఉండాలని చిన్న పిల్లలను బయటకూపంపకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు వచ్చే క్రమంలో రైతులు చెట్ల కింద నిల్చొకూడదని లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ఏమన్నా ఇబ్బంది తలెత్తితే వెంటనే పెద్ద శంకరంపేట పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మెదక్ రామాయంపేట ప్రధాన రహదారిపై ధర్నా



- బీటీ రోడ్డు నిర్మించాలని రహదారిపై తండా వాసుల ధర్నా
- పోలీసుల జోక్యంతో ధర్నా విరమణ

నవతెలంగాణ-హవేలి ఘనపూర్



పదేళ్లగా మట్టి రోడ్డుపైనే బురదలో నడుచుకుంటూ కాలం వెళ్ల తీస్తున్నాం. పాలకులు మారిన మా తండాకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపిన మా సమస్య పట్టించుకునే లేరని, నాలుగు గ్రామపంచాయతీ తండావాసులు మెదక్, రామాయంపేట్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని కొచ్చేరువు తాండ, ఔరంగాబాద్ తండా, గాజుల వాయి తండా, మోటకాడి తండా వాసులు మెదక్, రామయంపేట్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తాండ వాసులు మాట్లాడుతూ నాలుగు గ్రామపంచాయతీ తండాలకు గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తండా వాసులు గుర్తుంటారని ఎన్నికలు అయిపోయిన తర్వాత తండావాసులను పట్టించకపోవడం పట్ల నిరసన తెలుపుతున్నామని తెలిపారు. వర్షాకాలంతో తాండ మార్గం మట్టి రోడ్డు కావడంతో బురదమయం అయిందని తండాల నుంచి ప్రజలు పట్టణానికి రాకపోకలు చేయడానికి ఇబ్బంది ఉందని తెలిపారు. ఈ విషయాన్ని పై అధికారుల్ను, నాయకులు స్పందించి తండాలకు బీటీ రోడ్డు వెయ్యాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రోడ్డు మార్గం పనుల నిధులు కేటాయించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. పాఠశాలల విద్యార్థులకు, ఆసుపత్రికి వెళ్లే రోగులకు, బాలింతలకు సరియైన రోడ్డు మార్గం లేనందున ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రాణాలు పోయే ప్రమాదంలో ఉన్నామని తాండవ వాసులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించకపోతే పెద్ద ఎత్తున నిరసన చేపడతామని తెలిపారు.

భూధాన్ సీలింగ్ చట్టం ప్రకారం రైతులకే భూములు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం

నవతెలంగాణ-చేగుంట



మండలంలోని చిట్టోజిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 266/1లో గతంలో భూదాన్, సీలింగ్ చట్టం ప్రకారం పట్టా సర్టిఫికెట్లు పొందిన వారికే భూములు ఇవ్వాలని సీపీఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ 1974, 1993లో సీలింగ్ చట్టం ప్రకారం, 2004లో భూదాన్ చట్టం ప్రకారం గ్రామంలోని 192 రైతులకు 400 ఎకరాల భూమి పంచారన్నారు. ఇదే266/1 సర్వే నంబర్ ఇంకా 318 ఎకరాల మిగులు భూమి ఉందన్నారు. ఇట్టి భూమి పై దేశముక్ దొరలు అక్రమ పద్ధతుల్లో కోర్టులో కేసు వేసి పదేళ్లగా రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్ శరత్ రైతులకు అనుకూల రిపోర్ట్‌తో కోర్టుకు వివరాలు సమర్పించారన్నారు. దొరల వొత్తిడికి తలొగ్గిన అప్పటి తహసీల్దారు 2016, 2017 ఏడాదిల్లో కోర్టు స్టేతస్కోప్ పేరుతో రైతులను భూమి నుంచి బలవంతంగా తరిమివేశారన్నారు. ఒకవైపు కోర్టు కేసు నడుస్తుండగా ప్రస్తుతం దేవాదాయ శాఖ వారు ఇట్టి వివాద భూమిని గ్రామ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు రైతులకు నోటీసులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఇట్టి భూమి పరిరక్షణ కోసం చిట్టోజిపల్లి రైతుల 266/1సర్వే నంబర్ భూమిపై సమావేశం అయి పోరాట కమిటీని ఎన్నుకున్నారు. పోరాట కమిటీ కన్వీనర్‌గా కోటగిరి మల్లేశం కమిటీ సభ్యులుగా ఈద రాజు, ఏం.నర్సింలు, జి.పర్శరాములు, సి.ఎచ్ ఏళ్ళం, కే.మల్లయ్య, ఏ.ఎల్లం, కే.భూషణం, కే.స్వామి, పి.స్వామి, ఏం శ్రీను, సత్తయ్య ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు కె.మల్లేశం, మాజీ అధ్యక్షులు గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న ఉజ్జయిని మహంకాళి జాతం

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతరను అత్యంత వైభవోపేతంగా మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ మాట్లాడుతూ ఆదివారం రోజున తొలి పూజలు నిర్వహించారు. అమ్మవారికి తొలి పూజలతో ప్రారంభించి, బోనాలు, తొట్టెల కార్యక్రమాలు కన్నుల పండుగగా చేశామని, పోతరాజుల విన్యాసం, శివసత్తుల ఆటలు, పాటలు, కళాకారుల పని బాటల సంప్రదాయ నృత్యాలు భక్తులను అలరించాయి. సాయంత్రం తొట్టెల కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగాయి. ఉజ్జయిని మహంకాళి జాతరలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకురాలు అంక్ష రెడ్డి పాల్గొని, బోనమెత్తి అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పాల్గొని, మహంకాళి అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణచే ముఖ్య అతిథులకు ప్రత్యేక సన్మానం చేశారు. తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్లు పల్లెర్ల జ్యోతి, రవీందర్ గుప్తా, శ్రీశైలం గౌడ్, నారాయణ గుప్తా, రఘుపతి, భగవాన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్, ఉమర్, అనిల్‌లు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణ ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని ఒడిబియ్యం పోశారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
4
సోమవారం | 29 జులై 2024 | www.navatelangana.com

రోడ్డు ఇట్లా..మరి నడిచేదేట్లా..!



రెడ్డికుంటపల్లిలో బురదమయమైన రోడ్డు

నవతెలంగాణ-బెజ్జంకి

రెడ్డికుంటపల్లి మండల పరిధిలోని పోతారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం. ఇక్కడ అధికంగా ఎస్సీ సామాజిక వర్గాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధిలో రెడ్డికుంట పల్లి వివక్షతకు గురవుతూనే ఉందని. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు వివక్ష చూపి రెడ్డికుంటపల్లిలో ప్రధాన రోడ్డుకు మరమ్మత్తులు చేయకుండా విస్మరించారని ఆదివారం గ్రామస్తులు అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమేదైనా అభివృద్ధిలో వివక్షకు గురవుతున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు బురదమయమై నడువలేని స్థితికి చేరిందని ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు శ్రద్ధ చూపి రోడ్డుకు మట్టితో మరమ్మత్తులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పదవులు శాశ్వతం కాదు అభివృద్ధే శాశ్వతం

-మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్

నవతెలంగాణ-మర్కుక్



రాజకీయ జీవితంలో పదవులు శాశ్వతం కాదని చేసిన అభివృద్ధి పనులే చిరస్థాయిగా నిలుస్తాయని, మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మర్కుక్ మేజర్ సర్పంచ్‌గా, గ్రామ అభివృద్ధే లక్ష్యంగా గత ఐదేళ్లుగా పనిచేశానని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో గత ఆరు నెలలుగా స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతుండటంతో గ్రామాలు కుంటుపడిపోతున్నాయని ఆరోపించారు. ప్రజాసమస్యలు పరిష్కారం కావాలంటే క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు తప్పనిసరి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తమను ప్రజలు ఆదరిస్తే మరోసారి సేవ చేసే భాగ్యం కలుగుతుందని స్పష్టం చేశారు.

దాచారంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

అలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దాచారం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన ఘటన ఆదివారం అలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 25న స్థానికుడు సంతోష్ దూషించాడని దొగ్గల మంజుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

బడ్జెట్లో 6 గ్యారంటీలకు స్థానం

నవతెలంగాణ-గజ్వేల్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో 6 గ్యారంటీలకు స్థానం దక్కిందని గజ్వేల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నేతృతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల పక్షాన సమస్యలు తీర్చే విధంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే అవకాశం కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చిందని పేదలకు ఇల్లు నిర్మించిస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు బడ్జెట్లో పెద్దపీట వేసిందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో అభివృద్ధి ముందుకు వెళుతుందని చెప్పారు.

పద్మశాలి సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం

నవ తెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాజారాంను ఆదివారం వారి స్వగృహంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్ మాట్లాడుతూ అధ్యక్షులుగా ఎన్నికైన రాజారాంకు అభినందనలు తెలుపుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ దుర్గాప్రసాద్, లయన్ పరమేశ్వర చారి, దొంతుల సత్యనారాయణ, ఎల్లం రాజు, రవీందర్, పాల్గొన్నారు.

కొమురవెల్లి కేజీబీవీ పాఠశాలకు పరారీ గోడ నిర్మించాలి

-ఎస్ఎఫ్ఐ అధ్యక్షురాలు అత్తిని అరిక డిమాండ్

నవతెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లి కేజీబీవీ పాఠశాలకు పరారీ గోడ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్షురాలు అత్తిని అరిక డిమాండ్ చేశారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ హాస్టల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ మేరకు అధ్యక్ష కార్యదర్శులు అత్తిని హారిక, తాడూరి భరత్ కుమార్‌లు మాట్లాడుతూ కొమురవెల్లి కేజీబీవీలో పరారీ గోడను నిర్మించాలన్నారు. పరారీ గోడ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరారీ గోడ ఉంటే అమ్మాయిలకు రక్షణగా ఉంటదన్నారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విక్రమ్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాహితీ వనంలో విరిసిన పురస్కారం


నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేటకు చెందిన కవి, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య తెలుగు సాహితీవనం జీవన సాఫల్య పురస్కారం(2024) అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన సంస్థ ఏడవ వార్షికోత్సవంలో ఆయనకు ఈ విశిష్ట పురస్కారాన్ని అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు, కవులు ఆడెపు లక్ష్మీపతి, ప్రజాశక్తి ఎడిటర్ సత్యాజీ, అంపశయ్య నవీన్, యండమూరి వీరేంద్రనాథ్, ఏనుగు నరసింహారెడ్డి, బిల్లా శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరేంద్ర స్కూల్‌లో బోనాల పండుగ ఉత్సవాలు

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



ఆషాడ మాస బోనాలు ఉత్సవాల సందర్భంగా సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని అమరేంద్ర పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో బోనాల పండుగ ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు చరిత్ర, సంస్కృతి విలువలు విద్యార్థులకు వివిధ వేషధారణలో నిర్వహించి బోనాల పండుగ ఉత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గౌటి వెంకటేష్, రాజశేఖర్ బాలకృష్ణ, సంతోష్, పవన్, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు


నవతెలంగాణ-బెజ్జంకి



బెజ్జంకి మండల కేంద్రంలోని గ్రామ దేవతలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డప్పు, చప్పుల్లతో ఘనంగా బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామ దేవతలకు మొక్కలు సమర్పించారు. ముదిరాజ్ సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్




మండలంలోని పాములపర్తి గ్రామానికి దుబ్బాసి అరుణ (45) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. ఆదివారం మర్కుక్ మాజీ ఎంపీపీ తండా పాండు గౌడ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. వారితో పాటు కర్రోల్ల నర్సింలు, రవి, బాలయ్య, పోచయ్య, మహేష్, రఘుపతి, బాలకృష్ణ, కిష్టయ్య, నరేష్, మల్లయ్య తదితరులున్నారు.

మొక్కలను ప్రతి ఒక్కరు నాటుదాం

-మెదక్ ఎంపీ రఘునందన్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట



మొక్కలను ప్రతి ఒక్కరు నాటి, వాడిని రాక్షసిదామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం రంగనాయక సాగర్ వద్ద జరిగిన హాఫ్ మారతాన్ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో 5 వేల మొక్కలను ఎంపీ ప్రజలకు పంపిణీ చేశారు. మునగ, గోరింటా, పనస, తబుబియా, గన్నేరు, మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ జిల్లా అధికారి కొత్తపల్లి శ్రీనివాస్, అటవీ క్షేత్ర అధికారి ఇక్రముద్దీన్, ఉప అటవీ క్షేత్ర అధికారి లింగమూర్తి, బీట్ అధికారులు రవికిరణ్, సురేష్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అర్థికసాయం

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన బ్యాగారి ఎల్లమ్మ (80)అ శనివారం మృతి చెందింది. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న న్యాయవాది పులికంటి భాస్కర్ రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు.

భూ నిర్వాసితులకు రిజిస్ట్రేషన్‌లో ప్రక్రియ ప్రారంభించరా

నవతెలంగాణ- గజ్వేల్

మల్లన్నసాగర్లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయి మూడు నెలలు గడుస్తున్నది. ఎన్నికలు ముగిసి నెల రోజులకు సమీపిస్తున్న ఇప్పటివరకు రిజిస్ట్రేషన్‌లో ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఎన్నికల కోడ్, ఎన్నికల ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్లను గత మూడు నెలల క్రితం నిలిపివేసిన అధికారులు ఎన్నికల కోడ్ ముగిసినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించలేదు. దీంతో భూములు, సర్వం కోల్పోయిన నిర్వాసితులు కార్యాలయల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం సైతం భూనిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం, ఇతర ప్యాకేజీలకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు తోడు ఇటీవల రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్ల విషయమై అధికారులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపి వేసినట్లు తెలిసింది.

అధికారులు కనికరించాలి

నిర్వాసితులకు సంబంధించి రిజిస్ట్రేషన్ల విషయంలో అధికారులు కనికరించాలని నిర్వాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామని నాగ్దానం చేసిన ప్రభుత్వం కూడా తమను పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కనీసం మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యను పట్టించుకున్న నాథుడు కరువయ్యారని వాపోతున్నారు. నిర్వాసితుల సమస్యలు ఏటూ తేల్చకుండా. అధికారులు నాన్చివేత దోరణిని అవలంభిస్తున్నారు. భూనిర్వాసితుల సమస్యలు తీరాలంటే దాదాపుగా రూ.10కోట్ల వరకు అవసరముంటాయని అధికారులు అందనా వేశారు. నిధుల విడుదలకు చర్యలు చేపట్టకపోవడంతో బాటు ఉపాధి లేక, రావాల్సిన ప్యాకేజీ, పరిహారం రాక అనేక మంది భూనిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్యాకేజీలు, ప్లాట్ల కేటా యింపులు అందకుంటానే కొంతమంది లబ్దిదారులు మృతిచెందారు. కానీ ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలు పెట్టాలి

మల్లన్న సాగర్ భూనిర్వాసితులకు కేటాయించే ప్లాట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించి భూములు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారుల ఉదాసీనత వల్ల భూనిర్వాసితులు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్యాకేజీలకు సంబంధించి నిధులు విడుదలైనప్పుడే ఇచ్చే వీలుండగా, కనీసం ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తే తాము ఇండ్లు కట్టుకోవడమో, లేదా ప్లాట్లను విక్రయించుకుని పెళ్లిళ్లు, ఇతరత్రా పనులకు ఉపయోగపడతాయని భూనిర్వాసితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఈ విషయంపై చొరవ చూపకపోవడంతో రిజిస్ట్రేషన్లు, ప్యాకేజీలు నిలిచి, ఉపాధి కరువై బిక్కముఖం వేసుకుని భూనిర్వాసితులు తమలో తామే కుమిలి పోతున్నారు. అధికార యంత్రాంగం స్పంచించి ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించడంతో పాటు ప్యాకేజీ ఇతరత్రా విషయాలపై ప్రభుత్వం స్పందించాలని నిర్వాసితులు కోరుతున్నారు.



ఏసీరెడ్డి నర్సింంహారెడ్డి సేవలు మరువలేనివి

నవతెలంగాణ-మద్దూరు

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి

జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసీరెడ్డి నర్సింహారెడ్డి సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. మద్దూరు మండల కేంద్రంలో ఏసీరెడ్డి నర్సింహారెడ్డి, 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ ఆయన జీవితం ప్రజలకు స్ఫూర్తిదాయకమని చిన్నతనం నుంచి విప్లవ భావాలకు ఆకర్షితుడై ఆంధ్ర మహాసభలో చేరి ఆలేరులో జరిగిన ఆంధ్ర మహాసభ పై పోలీసులు జరిపిన కాల్పుల్లో తన తొడ నుంచి తూటా బయటికి వెళ్లిన జనక లేదన్నారు. అప్పటి నుంచి సీపీఐ(ఎం)పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజల కోసం తన జీవితాన్ని మొత్తం ప్రజాసేవకు అంకితం చేస్తూ పెళ్లి కూడా చేసుకోకుండా గడిపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారని, ఈ ప్రాంతంలో వేల ఎకరాల భూములను భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచిపెట్టిన గొప్ప నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఎండి షఫీ, నాయకులు పిడిశెట్టి సాయిలు, చిలక యాదగిరి, బాబు, సూర కనకరాజు, యాదగిరి, యాదయ్య, మురళి, ఎండి సిరాజ్, పాల్గొన్నారు



అందే గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

- పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం
- ఆరోగ్యమే మహాభాగ్యం
- రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు

నవ తెలంగాణ-మిరుదొడ్డి

పేద ప్రజలకు సేవ చేస్తే ఎంతో సంతోషంగా ఉంటుందని సామాజిక సమత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ జి రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండలం అందే గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సామాజిక సమరసత వేదిక, చేతన గ్రామీణ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆరు విభాగాల నుంచి వైద్యులు పాల్గొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వివిధ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కంటిచూపుతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. శిబిరం ఏర్పాటు చేయడం పట్ల అందే గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ అరవింద్, ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డాక్టర్ రాజేష్ కుమార్, సురేష్ రెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సంపత్ కుమార్, స్రవంతి, సమరసత వేదిక ప్రతినిధులు సుమన్, కనకయ్య, పోచయ్య, మహేష్, పవన్, సంతోష్ రుక్మిణి పలువురు పాల్గొన్నారు.



ప్రకృతిని పరిరక్షించాలి

- మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్



ప్రకృతిని పరిరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం ప్రపంచ ప్రకృతి దినోత్సవ సందర్భంగా తన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రకృతిని కాపాడుకుంటేనే ప్రతి ఒక్కరికి మనుగడ ఉంటుందని పేర్కొన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరూ ముందుకు నడవాల్సిందని పిలుపునిచ్చారు. ప్రకృతితోనే ఆర్థిక, సామాజికతో పాటు మానవ మనుగడ కొనసాగుతుందని పేర్కొన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులో ప్రకృతి సంరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వనం మనం కార్యక్రమంలో సహజ సంపదనకు ప్రకృతి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా జీవవైవిధ్యం సంరక్షించుట, వన్యప్రాణాలకు కాపాడుకునేందుకు స్థిరమైన పద్ధతులను సేకరించి భావితరాలకు వాటిని కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాబోయే తరానికి మంచి భవిష్యత్ అందించేందుకే ప్రకృతి పరిరక్షణ కార్యక్రమం ముందుకు సాగుతుందన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి

- టీసీఎల్ చైర్మన్ లక్ష్మణ్

నవతెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో పేద కుటుంబానికి చెందిన ఆటో మెకానిక్ స్వామి చిన్న కుమారుడు ప్రణీత్ ఆరోగ్య సమస్యల కొట్టుమిట్టాడుతున్నారని ఆయన తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ట్రస్టు తన వంతు సహాయం అందించిందన్నారు. ప్రణీత్ 80 ఏళ్ల వయస్సులోనే కిడ్నీ లివర్ సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రస్తుతం బాబుకు డయాలసిస్ జరుగుతుందని ప్రణీత్ వైద్య ఖర్చు నిమిత్తం రూ 10.వేలు అందించినట్లు తెలిపారు. అయితే పేదరిక లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరూ ముందుకు రావాలని అన్నారు. అంతేకాకుండా పేదలను ఆదుకునేందుకు కూడా ట్రస్టులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ నియోజకవర్గంలో అనేకమంది పేదలు ఉన్నారని చెప్పారు. పేదలను ట్రస్టుల ద్వారా కొంతైనా ఆదుకోవాలని ఉద్దేశంతో దశాబ్దాల కాలంగా తమ సంస్థ ముందుకు వచ్చి పేదలకు కొంత సాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి దుర్గాప్రసాద్, తమ్మలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించడం మండలానికి ఎంతో గర్వకారణం

- తల్లిదండ్రులను అభినందించిన గ్రామస్తులు

నవ తెలంగాణ-మిరుదొడ్డి



జూనియర్ లెక్చరర్ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగం సాధించడం మిరుదొడ్డి మండలానికి ఎంతో గర్వకారణమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజన్ మల్లికార్జున్, లక్ష్మణులు అన్నారు. ఆదివారం మీరుదొడ్డి మండల కేంద్రంలో చిన్ని గళ్ళ నర్సయ్య యాదమ్మల పెద్ద కుమారుడు నాంపల్లిని శాలువాతో సత్కారం చేసి సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ నరసయ్య యాదమ్మలు చిన్ననాటి నుంచి కొడుకు చదువు కోసం నిరంతరం కూలి చేస్తూ ఉన్నత చదువు చదివించారని అన్నారు. ఈరోజు నాంపల్లి పేదరికం నుంచి అధిగమించి ఉన్నత చదువు చదివి ఉద్యోగం సాధించడం ఎంతో సంతోషకరమని అన్నారు. సిద్దిపేట జిల్లాలో జూన్ నెల లెక్చరర్ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగం రావడం మిరుదొడ్డి మండలానికి ఎంతో గర్వకారణం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమములో మహారాజ్, లక్ష్మణ్ మహారాజ్, దీపక్ మహారాజ్, రవి మహారాజ్, దయాకర్ మహారాజ్, కర్ణకార్ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

దూళ్మిట్ట కాంగ్రెస్ మండల కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-మద్దూరు



జనగామ నియోజకవర్గం ఇంచార్జ్ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఆదేశాల మేరకు దూళ్మిట్ట కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్, ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల ఉపాధ్యక్షులుగా నాగిళ్ల బుచ్చిరెడ్డి, బూర గంగాధర్, మంద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గద్దల మహేందర్, కార్యదర్శులు కత్తెర నరసింహాచారి, చల్ల మాధవరెడ్డి, కోశాధికారి లాకావత్ కిషన్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా వరది కనక రాములు, జాటోత్ పూల్ సింగ్, పేరం కనకయ్య, మహమ్మద్ రజాక్, ధారావత్ హరిలాల్, గొర్ల సంపత్, ఇరుమళ్ళ ఐలయ్య, బానోత్ తరుణ్, శ్రీరాములు రాజు, భూక్య గోపాల్, తొర్రి మల్లేశం, చింతల రామచంద్రంలతో ,మండల కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఆల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట జిల్లాలో ఆల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యవర్గం ఎన్నికల్లో లారీ అసోసియేషన్ అధ్యక్షులుగా లియాకత్, ప్రధాన కార్యదర్శిగా బి.నర్సింలు(రాజు), కోశాధికారిగా గాలయ్య, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ వాజిద్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇద్దరు బరిలో నిలవగా సాజిద్ 2 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ లారీలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఓనర్ల హక్కులకై పోరాడుతామని తెలిపారు. చాలా ఎళ్లుగా లారీ ఓనర్లు కఠినమైన జీవితాన్ని వెల్లదీస్తున్నారని, వారి అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లారీ ఓనర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవ్వ తాతలకు ఉత్తరం రాద్దాం

- విద్యార్థులచే వినూత్న కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ
- పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిలో భాషా రచనల పట్ల ఆసక్తి కలిగించేందుకు "అవ్వ తాతలకు ఉత్తరాలు రాద్దాం రండి" అనే కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల గ్రామంలో వాల్ పోస్టర్ను ఉపాధ్యాయ బృందం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ సెల్ ఫోన్ మాయలో పడి నేడు ఉత్తరాలు రాసే వారే కరువైన్నారని, విద్యార్థులకు ఉత్తరాలు అంటే తెలియని దుస్థితి నెలకొందన్నారు. ఉత్తరాలపై అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేందర్ నిర్వాహకులు లక్ష్మయ్య, పూర్ణచంద్రరావు, అనిల్ కుమార్, సుహాసిని, శ్రీశైలం, రాజేందర్, రమాదేవి, సునీత, ఆగయ్య, శ్రీనివాస్, సరిత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్య వైద్యం ఉపాధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఎన్నికల ముందు ఒక మాట గెలిచిన తర్వాత మరో మాట

నవతెలంగాణ-మిరుదొడ్డి

విద్య వైద్యం ఉపాధి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో నిర్లక్ష్య వహించిందని డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాగట్ల చందు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ పేద ప్రజలు ప్రజలకు ఉపయోగపడే విద్య వైద్యం ఆరోగ్యంపై బడ్జెట్ కేటాయించడంలో నిర్లక్ష్యం చేయాడం సరికాదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఓట్ల రాజకీయం చేసి గద్దె ఎక్కిన తర్వాత బీసీ,ఎస్సీ, ఎస్టీ ప్రజలతో చెలగాటమాడం సరికాదని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబంలో ఉన్న పేదలకు విద్య ఆరోగ్యపట్ల ఎన్నో సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఎందుకు బడ్జెట్ కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారో అని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్లో సక్రమంగా బడ్జెట్ కేటాయింపులు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు లక్ష్మణ్, దిలీప్, దీపక్, రాజ్, రవి, దయాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు



నవతెలంగాణ- గజ్వేల్ రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని, బీసీ బిల్లు వెంటనే ప్రవేశపెట్టి, బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని గజ్వేల్ మండలం బీసీ సంఘం అధ్యక్షులు వల్లపు నర్సింలు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయం తేలిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని లేనిపక్షంలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు ఆందోళనలు, రాస్తారోకోలు, అమర నిరాదీక్షలు చేపడుతామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు బీసీలకు అన్యాయం చేసిందన్నారు. స్థానిక సంస్థలో బీసీ జనాభా ప్రకారం ప్రాతినిథ్యం పెరగాలని బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణ న్యాయం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు బీసీ కులగనన చేసి రిజర్వేషన్ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, వెంకటాచారి, బీసీ సంఘం నాయకులు, పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో గత 25 రోజులుగా ఎర్రవల్లి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎర్రవల్లి, గజ్వేల్ జట్టులు ఫైనల్ తలపడగా గజ్వేల్ జట్టు విజేతగా నిలిచింది. ఎర్రవల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి రూ.11 వేలు ఇటిక్యాల గ్రామానిక చెందిన నారసోల్ల రాజలింగం అందజేశారు. ద్వితీయ బహుమతి రూ. 5.5 వేలు పాములపర్తి బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు పాములపర్తి కరుణాకర్ అందజేశారు. ఇరు జట్లకు బహుమతులను డీజే శివ ఆర్థిక సహకారంతో అందజేశారు. టోర్నమెంట్ అన్నదాన కార్యక్రమాన్ని ఎర్రవల్లి గ్రామానికి చెందిన కుంట స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జగదేవపూర్ మండల పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కమ్మరి బాలరాజు, మర్కుక్ మండల స్పోర్ట్స్ క్లబ్ చైర్మెన్ చెన్ రాజ్ కృష్ణ, గజ్వేల్ సీనియర్ ప్లేయర్ కాజా భాయ్, అశోక్, తదితరులున్నారు.

పద్మశాలిల సంక్షేమానికి కృషి

-మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

నియోజకవర్గంలో ఉన్న పద్మశాలీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పద్మశాలి సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రాజా రామ్‌ను సన్మానించారు. నర్సారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీతో పాటు ఇతర మండలాల్లో మున్సిపాలిటీలో పద్మశాలీల సంక్షేమానికి ఆర్థికంగా రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. పద్మశాలి సంఘం నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన రాజారాం సంఘంను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, గాడి పల్లి శ్రీనివాస్, నరేష్, రాజేశం, బలరాం, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత



నవతెలంగాణ- రాయపోల్

వీధి కుక్కల దాడులు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయని మనుషులు, పశువులు అని తేడా లేకుండా దాడులు చేస్తూ ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ఇటీవల చిన్నపిల్లలపై దాడులు చేస్తూ ప్రాణాలను బలి తీసుకున్న వరుస సంఘటనలు కళ్ళముందే కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు మేల్కొనకపోవడం విడ్డూరం. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో తుప్పతి రాజయ్య గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తూ జీవిస్తున్నారు. తనకున్న గొర్రెలను ప్రతినిత్యం ఉదయం మేతకు తీసుకెళ్తూ సాయంత్రం ఇంటికి తీసుకొచ్చి పాకలో నివాసం ఉంచుతాడు. ఆదివారం వీధి కుక్కలు పాకలోని గొర్రెల మందపై దాడి చేయగా మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఒక గొర్రెకు తీవ్ర గాయాలయ్యాయి. ఇట్టి సంఘటన పశు వైద్యులకు సమాచారం అందించడంతో అక్కడికి పశు వైద్య సిబ్బంది శిల్ప రాజయ్య ఇంటికి వెళ్లి గొర్రెలను పరిశీలించి గాయాలైన గొర్రెకు చికిత్స అందించారు. గొర్రెల పెంపకం జీవనాధారంగా జీవిస్తున్నామని అలాంటిది ఇలా వీధి కుక్కలు దాడులు చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామని గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో సుమారు రూ.40 వేల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని బాధితుడు, స్థానికులు విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌కు మాతృవియోగం

-పాడె మోసిన ఎమ్మెల్యే పల్లా



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి తల్లి పుష్ప (58) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే అంతిమయాత్రలో పాల్గొని పాడే మోశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్ర ఐలయ్యను, ఇటీవల మృతి చెందిన మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన పంగాల అంబరీష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లేగదూడ మృత్యువాత



నవతెలంగాణ-మర్కుక్

విద్యుదాఘాతంతో లేగదూడ మృతి చెందిన సంఘట మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు కథనం ప్రకారం చేబర్తి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మయ్య రెండు ఆవులతో వ్యవసాయం చేస్తూ జీవనం కోన సాగిస్తుంటారు. ఆ రెండు ఆవులకు రెండు కోడె దూడలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం తమ పొలంలో వ్యవసాయ పనులు చేస్తుతున్న క్రమంలో పక్కనే , నేలకు సమాంతరంగా ఉన్న ట్రాన్స ఫార్మర్ ఉండటంతో లేక దూడ గడ్డి మేస్తున్న క్రమంలో ప్రమాద వశాత్త ట్రాన్స ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతం తగలడంతో లేగదూడ అక్కడి అక్కడే మృత్యువాత చెందింది. సంబంధిత ఆదికారులు బాధిత రైతును అదుకోవాలని గ్రామస్థులు కోరుకున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఆదివారం గజ్వేల్ పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జెడ్పీహెచ్ఎస్ అహ్మదీపూర్ 1993 - 94 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి మిత్రులు అందరూ ఒక చోట కలుసుకుని కష్టసుఖాలు పంచుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం చదువుకున్న మరపురాని మధుర స్మృతులను తలచుకుంటూ సంతోషంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్య బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు బాలముత్యం, మనోహర్ రెడ్డి, పవన్ కుమార్, అత్తెల్లి శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అంటూ సంభాషించుకున్నారు. చిన్నప్పుడు అందరం కలిసి చదువుకున్న మేమంతా దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు బెండే మధు, శశిధర్ రెడ్డి, బాల చారి, దయానంద్, కృష్ణ, వినోదిని, సరస్వతి, జ్యోతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-రాయపోల్

అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి అండగా నిల్చామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య అన్నారు. ఆదివారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన రెడ్డబోయిన యాదగిరి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ యాదగిరి మృతి చెందడం చాలా బాధాకరమని, మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నామని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. యాదగిరి కుటుంబం పేదరికంతో కొట్టుమిట్టాడుతుండటంతో ఆయన అంత్యక్రియల నిమిత్తం తక్షణ సహాయంగా, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని ఇండ్ల కేటాయింపు

- రద్దు చేయాలని పేదల డిమాండ్

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పట్టణంలో రెండు పడకల గదుల కేటాయింపు సమస్య ఏండ్లు గడుస్తున్నా కొలిక్కి రావడం లేదు. ఇటు మల్లన్న సాగర్ నిర్వాసితులు, మరోవైపు లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల మధ్య సమస్య నలిగిపోతుంది. ఇద్దరు మధ్య ఘర్షణ వాతావరణం వేడికి పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళింది. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. పేదలకు సొంతింటి కలలు నెరవేర్చేందుకు గత ప్రభుత్వం మున్సిపాలిటీలో 1200 ఇళ్లను నిర్మించింది. ఒక ఇల్లు విస్తీర్ణం 570 చదరపు అడుగులు, 156 బ్లాకులో కాలనీ నిర్మించారు. ఒక బ్లాక్ పై అంతస్తులు నాలుగు కుటుంబాలు, క్రింది భాగంలో నాలుగు కుటుంబాలు ఉండేలా నిర్మాణం చేపట్టారు.

ఎంపిక వివాదంగా మారింది

గత ప్రభుత్వం సూచన మేరకు అధికారులు 2021 మే 13 నుంచి మే 20 వరకు 4106 మంది లబ్ధిదారులు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2023 ఫిబ్రవరి 3న 1118 మంది అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను మున్సిపల్ కార్యాలయం వద్ద అంటించారు. దీనిపై అనేక అభ్యంతరాలు తలెత్తగా మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. పెరిగిన వాటితో కలిపి 1389 పేరుతో మూడోసారి జాబితా అంటించారు. లక్కీ డ్రా తీసి తేదిని ప్రకటించడంతో గజ్వేల్‌లో ప్రతిపక్ష పార్టీల నాయకులు, పేదలు కలిసి ఆందోళన చేయడంతో వాయిదా వేశారు. అధికారులు మరోసారి సర్వే నిర్వహించారు. కొత్తగా మరో 300 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు.

1550 మంది పేర్లతో..

మూడో జాబితాలో ఇండ్లు ఉన్న కొందరిని తొలగించి 1550 ముందుకు మూడో జాబితాను విడుదల చేశారు. గజ్వేల్ పట్టణంలో రోడ్ల విస్తరణలు ఇండ్లు



కోల్పోయిన వారికి కేటాయించేందుకు కొన్నిటిని మినహించి 110 మంది లబ్ధిదారుల పేర్లను 2023 మార్చి 21 లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. కానీ ఇండ్లను వారికి అప్పగించకపోవడంతో గందరగోళం నెలకొంది. ఏడాదైనా సమస్య పరిష్కారం మాత్రం కాలేదు.

మొత్తం ఇండ్లు 1200. నిర్వాసితులు ఉన్న ఇండ్లు 700, తాళాలు వేసినవి 300 ఇండ్లు, లాటరీ పద్ధతిలో వెళ్లినవారు 200 మంది ఉంటున్నారు.

కలెక్టర్ దృష్టికి....ఇండ్లు ఉన్నవారిని గుర్తించి..

లాటరీ పద్ధతిలో 1100 మందికి ఇల్లు రాగా ఇందులో ఇండ్లు ఉన్నవారికి వచ్చినట్లు గత నాలుగైదు సార్లు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి తో పాటు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్యలు కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తనిఖీ చేసి సర్వే చేశారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఎంపిక ప్రక్రియపై మళ్లీ మొదటికి వచ్చింది. నెలరోజుల కిందట అధికారులు సర్వేకు వెళ్ళితే మల్లన్న సాగర్ నిర్వాసితులు అడ్డుకున్నారు. నిర్వాసితులకు పూర్తి బెనిఫిట్స్ వచ్చేవరకు ఖాళీ చేయమని చెప్పారు. ఇప్పటికి 700 మంది నిర్వాసితులు అందులోనే ఉంటున్నారు. కొందరు మాత్రం ఖాళీ అయిన చోట డ్రా పద్ధతిలో వెళ్లిన లబ్ధిదారులు అందులో ఉంటున్నారు. సుమారు 200 మంది వరకు లాటరీ పద్ధతిలో వెళ్లినవారు ఇండ్లను కైవాసం చేసుకున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు సర్వే చేస్తూ ఖాళీ అయిన వాటిపై నిఘా పెట్టి ఉంచారు. ఏది ఏమైనా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లొల్లి పూర్తి అయ్యేది ఎప్పుడో తెలియదు.

పూర్తిగా రద్దుచేసి మళ్లీ దరఖాస్తులు తీసుకోవాలి
-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్లయ్య



గజ్వేల్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయి. పూర్తిగా రద్దుచేసి కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ కూడా హామీ ఇచ్చినట్లు చెప్పారు. వివాదం రోజురోజుకు పెరుగుతుందని అందుకే డ్రా పద్ధతిలో తీసిన లిస్టును వెంటనే రద్దు చేయాలి. ఇల్లు ఉన్నవారికి మళ్ళీ డ్రా పద్ధతిలో వచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే నాలుగుసార్లు జిల్లా కలెక్టర్‌ను ఇండ్లు రాని లబ్ధిదారులతో కలిశాం. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో రెండుసార్లు కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశాం. సానుకూలంగా స్పందించారు.

20 ఏళ్లుగా అద్దెకుఉంటున్నాం... అంజమ్మ



గజ్వేల్ పట్టణంలో 20 ఏళ్లుగా అద్దె కుంటున్నాం. అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నాం. ఇండ్లు ఉన్నవారికి డ్రా పద్ధతిలో ఇండ్లు వచ్చాయి. పేదలు ఎవలు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్ళాం, ఎమ్మార్వో ఆఫీస్‌కి వెళ్ళాం. ఎవరు స్పందించడం లేదు. మళ్లీ దరఖాస్తులు తీసుకోండి.

డ్రా పద్ధతిలో ఉన్నవారికి వచ్చాయి..... మంజుల.



గత ప్రభుత్వంలో 1100 మందికి డ్రా పద్ధతిలో లాటరీ తీశారు. ఇందులో చాలామందికి ఇల్లు ఉన్నవారికి వచ్చాయి. 20 ఏళ్లకు పైగా అద్దె కుంటున్నాం. అద్దెలు కట్టలేకపోతున్నాం. దశాబ్దాలుగా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ఇండ్లు ఇవ్వటం లేదు. ఇప్పటికి నాలుగైదు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇల్లు మాత్రం దక్కడం లేదు.

ఫ్రీ జర్నీతో పిచ్చెక్కుతోందన్న ప్రయాణికులు

- సరిపడా బస్సులు లేక ఎన్నో ఇబ్బందులు
- ఒకరిని ఒకరు తోసుకుంటూ ప్రయాణం
- బోనాల సీజన్ కావడంతో బస్టాండ్ వద్ద పడి గాపులు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఫ్రీ జర్నీతో తలప్రాణం తోక వస్తుంది... ఆధార్ కార్డు చూపిస్తే రాష్ట్రంలో ఎక్కడైనా మహిళలకు ఫ్రీ జర్నీ అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దాంతో ప్రతి మహిళ ఆర్టీసీ బస్టాండ్ వద్ద పడి గాపులు కాస్తున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో ఆదివారం సుమారు 100 మంది ప్రయాణికులు రెండు గంటలకు పైగా బస్టాప్ వద్ద వేచి ఉన్నారు. అటుగా వెళ్లిన నవతెలంగాణ వెళ్లిన విలేఖరి వారిని పలకరించారు. వారి ఆవేదనను విలేఖర్లతో పంచుకున్న మాటలు ఇవి. ఫ్రీ జర్నీ అంటూ రాష్ట్రంలో సరిపడా బస్సులు లేక సతమతమవుతున్నాం. ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ సిద్దిపేట వైపు గతంలో 30 నిమిషాలకు బస్సు వచ్చేది. ప్రస్తుతం 45 నిమిషాలకు ఒక బస్సు వస్తున్న ఏ బస్సులో ఎక్కుదమాన్నా సందు లేదు. బస్సులో ఎక్కుదామంటే ప్లేస్ లేకుండా నిలబడే వస్తున్నారు. దిగేవాళ్ల తక్కువ... ఎక్కే వాళ్ళు ఎక్కువ అన్న చందంగా ఆర్టీసీ బస్సులు తయారయ్యాయి. ఎక్కడ చూసిన కిక్కిరిసిన జనం. వేరే చోటకు వెళ్లాలంటే బస్సు ఎలా ఎక్కాలో తెలియక గంటల తరబడి స్టాప్‌ల వద్ద అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వ సరిపడా బస్సులు వేసి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి. బస్సులో ఎక్కిన తర్వాత నిలబడదామన్నా కూర్చుందాం అన్న ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పలుమార్లు గొడవలు ఘర్షణలు ఆయన సంఘటనలు ఉన్నాయి. పండుగలు, బోనాల సమయంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం ప్రజల ఇబ్బందులు తక్కువ అవుతాయి.

ఆదివారం వస్తే అంతా ఆగమాగం.

ప్రస్తుతం హైదరాబాద్ జంట నగరాల్లో ఆషాడం బోనాల పండుగలు జరుగుతున్నాయి. ఈ సమయంలో సిద్దిపేట, గజ్వేల్ ప్రజ్ఞాపూర్, తూప్రాన్, ప్రధాన పట్టణాల నుంచి వేల సంఖ్యలో జనాలు హైదరాబాద్ వెళ్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఒక్క బస్సులో కనీసం నిలబడదామన్న చోటు లేకుండా ఉంది. అలాంటి సమయంలో బోనాల పండుగకు వెళ్లాలంటే ప్రత్యేకంగా వాహనాలను కిరాయికి మాట్లాడుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సిద్దిపేట నుంచి హైదరాబాద్ కారు కిరాయి తీసుకొని వెళ్లాలంటే రూ.5 వేలు తీసుకుంటున్నారు. పేద కుటుంబాలపై కిరాయిలు పెను భారంగా మారాయి బోనాలు నిర్వహిస్తున్న సమయంలో 15 నిమిషాలకు ఒక బస్సు వేస్తే ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా ఉంటాయి. ఆదివారం ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో బోనాల పండుగకు పెళ్లి ప్రయాణికులు 150 మంది మూడు గంటలు పడిగాపులు కాసారు. మూడు గంటలలో పది బస్సులు వచ్చిన అందులో పది మంది కూడా ఎక్కలేదు కాలు సందుపెట్టే ప్లేస్ లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు సరి చేయాలి.
సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ

ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయనేది నివేదిక తయారుచేసి పై అధికారులకు అందజేయాలి. దానివల్ల ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు ఎలా చేపట్టాలని దానిపై చర్చ జరుగుతుంది. బస్ స్టాప్‌ల వద్ద ప్రయాణికులు గంటల తరబడి నిలవడం చూస్తున్నాం ఓపిక నశించి బస్సు ఎక్కే సమయంలో ఎన్నో ఇబ్బందులు అవుతున్నాయి. ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడితే ఆర్టీసీ సంస్థ భారీ మూల్యం చెల్లించవలసి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

ప్రజలను ఇబ్బందులు పెట్టే పథకాలు పెట్టొద్దు.
-బీఆర్ఎస్ నాయకులు మార్కంటి కనకయ్య



గత ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టింది. ప్రజలకు, ప్రయాణికులకు ప్రత్యేక బస్సులను నియమించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ పథకాలు అంటూ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నాయి. ఫ్రీ పథకాల వెనకాల ఉన్న గుట్టు అమాయక ప్రజలకు తెలియదు. ఆధార్ కార్డు చూపిస్తే రాష్ట్రంలో ఎక్కడైనా ప్రయాణించవచ్చని ఆరు గ్యారెంటీలో ఒక గ్యారెంటీ అంటూ పెట్టారు. దాంతో ఏం పని లేని వాళ్ళు కూడా ఫ్రీగా ప్రయాణమే కదా అని బస్సు ఎక్కుతున్నారు. అత్యవసర పనులు ఉన్న అమాయకులకు ఫ్రీ పథకాలు శాపంగా మారింది. పథకాలు పెట్టడమే కాదు అమలు తీరు కూడా ఆచరణలో ఉండాలి. ఈ పథకాల వల్ల ఆర్టీసీ బస్సుల్లో జుట్టు జుట్టు పట్టుకుని కొట్టుకున్న రోజులు ఉన్నాయి.

ప్రయాణికుల ఇబ్బందులు అంతాఇంతా కాదు
-మెతుకు సాయిబాబా



ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమంటు ఎన్నో బోర్డులపై రాయడం చూసాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా ఆ పదాల అర్థాలు మారిపోయాయి. ప్రస్తుతం ఆర్టీసీ ప్రయాణం అంతా ఈజీ కాదు. బస్ ఎక్కాక గొడవ కాకుండా పోదు అనే చందంగా మారింది. ఏ సమయంలో బస్సులో ఎవరు ఎక్కుతారో, గొడవ ఎవరి రూపంలో ఎక్కడి నుంచి వస్తుందో అని బిక్కుబిక్కుమంటు స్టేజి వచ్చేంతవరకు ప్రయాణికులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం కేవలం ఆర్టీసీలో ఫ్రీ ప్రయాణమే. సరిపడా బస్సులు లేక సతమతమవుతున్న ప్రయాణికులు. అత్యవసర సమయంలో ఆర్టీసీ ఎక్కక తప్పని మహిళలు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఫ్రీ సంక్షేమ పథకాలు పెట్టడం సంతోషమే కానీ, వాటి అమలుతీరులో చైతన్యం రావాలి.

ప్రమోషన్‌లలో దళిత బహుజనులకు అన్యాయం



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోషన్లలో దళిత బహుజనలకు అన్యాయం చేశారని, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సిద్దిపేట అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతు తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు ప్రిన్సిపల్ ప్రమోషన్లు ఇవ్వడంలో ఎలాంటి నిబంధనలు పాటించలేదని, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పోస్టుల భర్తీకై జనవరి 2020 నోటిఫికేషన్ ఇచ్చారని, అందులో చాలా వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ పోస్టులను ఖాళీగా ఉంచారన్నారు. వాటిని ఇప్పుడు పూర్తిస్థాయి ప్రమోషన్లతో నింపడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేశారని, వాటిని వెంటనే రద్దు చేసి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, ఇలాం టివి పునరావృతం కాకుండా, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, తెలంగాణ ఉన్నత విద్యా ప్రమా ణాలను తుంగలో తొక్కుతూ ఇష్టాను సారంగా ఏకపక్ష నిర్ణయాలు అమలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి చేసి బంగారు నగలు చోరీ



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల కేంద్రానికి చెందిన కోల నర్సవ్వ వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుంది. ఆమెకు పిల్లలు లేకపోవడంతో వారి అన్న కూతురు సత్తవ్వను దత్తత తీసుకుంది. సత్తవ్వ శుక్రవారం బెజుగామ గ్రామంలోని తన అక్క ఇంటికి వెళ్లింది. రాయపోల్ ఇంట్లో ఆమె మేనత్త నర్సవ్వ ఒంటరిగా ఉంది. శనివారం రాత్రి నర్సవ్వ భోజనం పూర్తి చేసుకొని తన ఇంటిలో తన పడక గదికి గొళ్ళెం పెట్టుకొని నిద్రించింది. అర్ధరాత్రి ఎవరో గుర్తుతెలియని దొంగలు ఆమె ఇంటికి వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఆమె పడక గది తలుపులు పగులగొట్టి ఆమె వద్ద ఉన్న 1.5 తులాల బంగారు చెవుల గెంటీలు, 2 తులాల బంగారు గుండ్లు, 20 తులాల వెండి కాళ్ల పట్టగొలుసులను బలవంతంగా ఆమెపై దాడి చేసి లాక్కొని పరారయ్యారు. అర్ధరాత్రి చీకటి కారణంగా ఆమె అట్టి నిందితులను గుర్తించలేదు. గెంటీలు బలవంతంగా లాగడం వల్ల చెవులు తెగి గాయాలయ్యి రక్తస్రావం అయింది. ఉదయం ఇట్టి సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సంఘటన స్థలంలోని ఇంటికి వెళ్లి విచారణ చేశారు. బాధితురాలు నరసవ్వ మేనకోడలు సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది దేవరాజ్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికలకు సిద్ధం కండి

- పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు



నవతెలంగాణ- గజ్వేల్

రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ ఎన్నికలకు గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు పీసీసీ అధికార ప్రతినిధులు బండారు శ్రీకాంత్ రావు, నాయిని యాదగిరి అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికలకు కార్యకర్తలను రంగంలో ఉంచినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధ్యక్షునిగా రంగంలో ఉంటున్న ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ నర్సింగరావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శెట్టిపల్లి అనిల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బునారి రాజు, గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షునిగా కొత్తపేట కర్ణాకర్ రెడ్డి, గజ్వేల్ మండల అధ్యక్షులు బాలయ్యగారి రాజు, వర్గల్ మండల అధ్యక్షులుగా సల్మాన్ హుస్సేన్లను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా మర్కుక్ మండల అధ్యక్షుడిగా ప్రభుదాస్, కొండపాక మండల అధ్యక్షులుగా రవి, జగదేవపూర్ మండలాధ్యక్షుడు దాస్, ములుగు మండల అధ్యక్షులుగా మహేందర్, తూప్రాన్ మండల అధ్యక్షులు కొండ శేషు భూషణ్ రెడ్డి, తదితరులను రంగంలో దించినట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల్ రావు, ప్రశాంత్, విజయ్ కుమార్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొని తీర్మానాలు ప్రవేశపెట్టారు.

న్యాయవాది సతీష్ మృతి తీరని లోటు

- మిత్రుల ఆధ్వర్యంలో కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



నవతెలంగాణ-కోహెడ

న్యాయవాది సతీష్‌కుమార్ మృతి తీరని లోటని వినాయక న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, హైకోర్టు న్యాయవాది రవీంద్రప్రసాద్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది యం.సతీష్ కుమార్ చిత్రపటానకి పూల మాలవేసి, మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాది వృత్తి చెపట్టి ఇటీవల ఆకాల మరణం చెందడం మిత్రులకు, కుటుంబ సభ్యులకు తీరనిలోటన్నారు. ఆయన మాతృమూర్తికి రూ.46 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు, న్యాయవాదులు సాగర్, సుమన్, రాజేష్, బీఎస్పీ నాయకులు అశోక్, బంధువులు రంజిత్, మనోజ్, సంతు, రమేష్, తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామానికి చెందిన అప్పీసు బాలమ్మ, గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో. మృతురాలి కుమారునితో 2005-06 లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు మృతురాలి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.11 వేలు ఆర్థిక సాయంని అందించి స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు.

వంగపల్లి రేషన్ డీలర్ మృతి



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని వంగపల్లి గ్రామా రేషన్ డీలర్ చాట్ల జయరాం 65 అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎండి కరీం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జయరాం వంగపల్లి రేషన్ డీలర్గా 40 ఏళ్లుగా సేవలందించారని ఆయన తెలిపారు. రేషన్ డీలర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. మృతునికి ముగ్గురు కుమారులు, భార్య ఉన్నారు.